నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939



సంపుటి :12 సంచిక :352 రంగారెడ్డి | గురువారం 16 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 16-04-2026 | Thursday | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada


## దేశం అభివృద్ధి చెందాలంటే తొమ్మిది పనులు చేయాలి: మోదీ



కర్ణాటక, ఏప్రిల్ 15 నిర్భయవార్త : ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటక ప్రజలతో ప్రమాణం చేయించారు. దేశం అభివృద్ధి చెందాలంటే తాను చెప్పే తొమ్మది పనులు చేయాలని, ఆ తొమ్మిది పనులు చేస్తామని ప్రమాణం చేయాలని ఆయన కోరారు. ఆ మేరకు ప్రజల చేత ప్రమాణం చేయించారు. ఇవాళ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మహా సంస్థాన మఠంను ప్రధాని సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగిస్తూ ప్రజల నుంచి 9 పనులపై హామీ తీసుకున్నారు.'మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు ఆ 9 హామీలు నెరవేరుస్తామని ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతోపాటు దేశ అభివృద్ధి కూడా వేగంగా జరుగుతుంది' అని ప్రధాని మోదీ చెప్పారు. ఆ తర్వాత ఆ 9 పనుల గురించి ప్రజలకు తెలియజేశారు. నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడతామని, పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిస్తామని, అమ్మ పేరుతో మొక్కలు నాటుతామని ప్రజల నుంచి ప్రధాని హామీ తీసుకున్నారు.అదేవిధంగా 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుతామని, జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రసాయనాలు లేకుండా పంట సాగు చేస్తామని, ఆహారంలో మిల్లెట్స్‌ను భాగం చేసుకుంటామని, నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిస్తామని, ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుకుంటూ ప్రకృతికి సేవ చేస్తామని ప్రధాని హామీలు పొందారు. ఇలా మొత్తం 9 పనులకు సంబంధించిన హామీలను ప్రధాని తీసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా వైద్యం పొందే అవకాశం కల్పిస్తున్నామని గుర్తుచేశారు.

## కుప్పలు, తెప్పలుగా అప్పులు చేస్తున్న రేవంత్‌ను నిలదీయాలి : కేటీఆర్



మేడ్చల్, ఏప్రిల్ 15 నిర్భయవార్త ప్రతినిది :బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బద్నాం చేయడానికి కుప్పలు, తెప్పలుగా అప్పులు చేస్తున్న రేవంత్ రెడ్డిని నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో పలువురు కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర యేండ్ల కాలం అయిందని, ఎన్నికల ముందు అడ్డగోలుగా ఇచ్చిన హామీలు ఇంకా నేరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ హామీలతో గ్రామాల్లో అమాయక ప్రజలు నమ్మి మోసపోయారని, తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మలేదని, ఒక్క సీటు కూడా కాంగ్రెస్ గెలవలేకపోయిందని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో దొంగలే సంతోషంగా ఉన్నారు..

ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగ పిల్లవాడు పుడితే రూ.12వేలు ఇచ్చి తల్లి బిడ్డను ఇంటి దగ్గర దించి వచ్చేలా అనాడు కేసీఆర్ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. రేవంత్ పాలనలో అనేక కార్యక్రమాలు రద్దయ్యాయని వివరించారు. హైదరాబాద్ లో ఎవరైనా సంతోషంగా ఉన్నారంటే ఇద్దరే ఇద్దరు సంతోషంగా ఉన్నారు. ఒక్కరు దొంగలు, మరొక్కరు దోమలు. హైదరాబాద్‌లో ఎక్కడబడితే అక్కడ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరోపక్క ముఖ్యమంత్రి భూములు కబ్జాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉప్పల్ ఫ్లై ఓవర్ భూమి పుట్టినప్పటి నుంచి నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్ట్ 8 ఏండ్లు అయింది. ఎక్కడ పని అక్కడే ఉందని ఆరోపించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మూడుకు మూడు క్లిన్ స్వీప్ చేశారని, మరోసారి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ గెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ బుల్డోజర్ వస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్, జక్కా వెంకట్ రెడ్డి , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# టూరిజం స్పాట్‌గా పులిగుండాల



- కాటేజీల నిర్మాణానికి ₹4 కోట్లు మంజూరు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఎకో టూరిజానికి ప్రాధాన్యం : మంత్రి పొంగులేటి

## పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

ఖమ్మం, ఏప్రిల్ 15 నిర్భయవార్త ప్రతినిది : ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట గ్రామంలోని పులి గుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా బోటింగ్, వాటర్ ఫాల్స్, జంగిల్ సఫారీ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ అందమైన ప్రదేశాన్ని పరిచయం చేసిన స్థానిక ఎమ్మెల్యే, డి.ఎఫ్.ఓ. లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, తెలంగాణలోని ప్రకృతి సౌందర్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కనకగిరి హిల్స్ అభివృద్ధిని తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్ట్ నీటి పరిసర ప్రాంతాల్లో రెండు వైపులా కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు సిఎస్ఆర్ నిధుల నుండి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పనుల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే కాలపట్టికను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

పర్యాటకులు ఈ ప్రాంతానికి సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

### ఎకో టూరిజానికి ప్రాధాన్యం : మంత్రి పొంగులేటి

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కనకగిరి హిల్స్ వంటి అందమైన ప్రాంతాలను సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎకో టూరిజం క్రింద రాష్ట్రంలో టాప్ 3 గమ్యస్థానాలలో ఒకటిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు.ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించిందన్నారు. అలాగే ఈ ప్రాంతానికి వెళ్లే యాక్సెస్ రోడ్డు ను డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించి మిగిలిపోయిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రస్తుత ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు ఆ ప్రాజెక్ట్ నుండి ఈ ప్రాంతానికి నీటిని తీసుకువచ్చి నిరంతర నీటి సరఫరా కల్పించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి, సాధ్యమైతే ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# బీహార్‌లో ముగిసిన నితీష్ యుగం..



## సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సమ్రాట్ చౌదరి

పాట్నా, ఏప్రిల్ 15 నిర్భయవార్త : బిహార్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని పాలించిన నితీష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన బలమైన నేత సమ్రాట్ చౌదరి బుధవారం బిహార్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మారిన రాజకీయ ముఖచిత్రం

2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధించిన తర్వాత, నితీష్ కుమార్ రికార్డు స్థాయిలో 10వ సారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అయితే, అనూహ్య పరిణామాల మధ్య ఆయన క్రియాశీల రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో బిహార్‌లో నితీష్ కుమార్ యుగం ముగిసి, బీజేపీ నేతృత్వంలోని సరికొత్త అధ్యాయం మొదలైంది. బిహార్‌కు బీజేపీ నుంచి ముఖ్యమంత్రి కావడం ఇదే తొలిసారి.

ఎవరీ సామ్రాట్ చౌదరి?

57 ఏళ్ల సమ్రాట్ చౌదరి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి శకుని చౌదరి ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. తల్లి పార్వతీ దేవి కూడా ఎమ్మెల్యేగా సేవలందించారు. 1990లలో ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సామ్రాట్, 2018లో బీజేపీలో చేరారు. 2023లో బీహార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, 2024లో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. నితీష్ కుమార్‌ను అధికారం నుంచి దించే వరకు తాను తలపాగా (మురేథా) తీయనని 2022లో ఆయన బహిరంగంగా శపథం చేశారు. నేడు నితీష్ స్థానంలో ఆయనే ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకోవడం గమనార్హం.

వ్యూహాత్మక అడుగు

బిహార్‌లో వెనుకబడిన తరగతుల, ముఖ్యంగా కోయిరీ/కుష్వాహ సామాజిక వర్గాల్లో సమ్రాట్ చౌదరికి మంచి పట్టు ఉంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేస్తూ బీజేపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

శుభాకాంక్షల వెల్లువ

సమ్రాట్ చౌదరి సీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆయనకు అభినందనలు తెలిపారు. 'సమ్రాట్ చౌదరి గారి నాయకత్వంలో బిహార్ అభివృద్ధిలో కొత్త శిఖరాలను చేరుకుంటుందని, సుపరిపాలన, శ్రేయస్సు దిశగా రాష్ట్రం ముందుకు సాగుతుందని నేను పూర్తి విశ్వాసంతో ఉన్నాను' అని పాశ్వాన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. నితీష్ కుమార్ వంటి అనుభవజ్ఞుడైన నేత తర్వాత బాధ్యతలు చేపట్టిన సమ్రాట్ చౌదరి ముందు ఇప్పుడు అనేక సవాళ్లు ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించడంతో పాటు, మిత్రపక్షాలను కలుపుకుని పోవడంలో ఆయన ఏ విధంగా సఫలమవుతారో వేచి చూడాలి.

నిర్భయవార్త

సంపాదకీయం

గురువారం 16, ఏప్రిల్ 2026

# పెన్షనర్లతో చెలగాటమెందుకు?

ప్రభుత్వాలు వృద్ధుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇది నేడు పరాకాష్ఠకు చేరింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 55కు తగ్గించారు. పెన్షనర్లు అందరూ ఆఫీసర్లు కాదు. సహజ వనరులు, అధిక ఆదాయాలున్న వారు కాదు. వీరిలో వాచ్‌మెన్లు, అటెండర్లు, రికార్డు అసిస్టెంట్లు, డ్రైవర్లు, పోలీసులు, ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. ఇలాంటివారినా ప్రభుత్వం వేధించేది? పెన్షనర్లకు అప్పుపడ్డ ప్రభుత్వానికి జ్ఞానోదయమవుతుందా? ప్రభుత్వాలు వృద్ధుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇది నేడు పరాకాష్ఠకు చేరింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 55కు తగ్గించారు. ఈ చర్య ఉద్యోగుల పాలిట ఆత్మహత్యా సదృశమైంది. తరువాత నాదెండ్ల భాస్కరరావు దానిని 58కి మార్చారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేక ప్రభుత్వాలు ఇలాంటి పిల్లిమొగ్గలు వేస్తూ తలబొప్పి కట్టించుకుంటున్నాయి. నూతన ఆర్థిక విధానాల వెల్లువలో ప్రభుత్వాలు ప్రజల, ఉద్యోగుల, నిరుద్యోగుల హక్కుల కన్నా విధులకు ప్రాధాన్యం ఇస్తూ ఒక్కటొక్కటిగా హక్కులను నిర్వీర్యం చేస్తున్నాయి. ఉద్యోగుల హక్కులు, భద్రత, స్వీయగౌరవం, సమాజ నాగరికతా వికాసం అనే భావజాలాన్ని లాభనష్టాల భావజాలంగా, ప్రైవేటు రంగానికి కలిసివచ్చే భావజాలంగా అభివృద్ధి చేస్తూ వచ్చాయి. ఈ భారమంతా వృద్ధతరం మోయాల్సివస్తున్నది. యాభై ఏళ్లు దాటిన వాళ్లను మీడియా వృద్ధులు అంటున్నది! ఇదే నిజమైతే అన్ని రంగాలలో వీరే శక్తికి మించిన కృషి చేస్తున్నారు. 58 ఏళ్లు నిండి రిటైరైన వాళ్లను తిరిగి కాంట్రాక్టు, అవుట్‌సోర్స్ పద్ధతుల్లో నియమించుకుని వారి శ్రమను దోచుకుంటున్నారు. ఇటీవల ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షన్ల సమస్య తీవ్ర చర్చనీయాంశమవుతున్నది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. రాష్ట్ర పెన్షనర్లు ఇటీవల నిర్వహిస్తున్న ఆందోళన శిబిరాలకు వెళ్లినప్పుడు పెన్షనర్లు తమ బాధ ప్రభుత్వానికి తెలిసేలా రాయమని కోరారు. ప్రభుత్వం ఎవరి కోసం ఇంత బాధ్యతారాహిత్యంగా ఉంటున్నది? ఎందుకు వృద్ధతరానికి అప్పు పడింది? ఎందుకు వారి స్వాభిమానాన్ని దెబ్బతీసి బలవన్మరణాల చితి మీదికి నెట్టి చోద్యం చూస్తున్నది. పెన్షనర్లు ఆవేదన పడుతున్నారు కానీ ఇది విధాన వైఫల్యం అనుకోవడం లేదు. అందుకు మూలాలు గ్రహించే చైతన్యం అవసరం. ఈ పని సంఘాలు చేయడం లేదు, అయితే పెన్షనర్లు బలవుతున్నారు. ఇప్పటికే పెన్షనర్లను సీపీఎస్, ఓపీఎస్‌గా విడగొట్టారు. ఓపీఎస్ వారిని 2025కు ముందు, తరువాతి వాళ్లుగా విడగొడుతున్నారు. ప్రభుత్వం ఉద్దేశం పెన్షన్లు ఎగ్గొట్టాలనే. ఇప్పటికే వివిధ కార్పొరేషన్లలో దశాబ్దాలు పనిచేసి రిటైరయిన ఉద్యోగులకు పెన్షన్లు లేవు. వారు తమ జీవితాలు కరిగించుకుని కార్పొరేషన్లకు, తద్వారా సమాజానికి సేవలు చేసి రిటైరై, ఇవాళ బేల ముఖాలతో బతుకులు ఈడుస్తున్నారు. ఇళ్లు లేనివాళ్లు, పిల్లలు స్థిరపడని వాళ్లు, రోగాల పాలై కుదురుకోని వాళ్లు అనేక కష్టాలతో స్వీయగౌరవ సంక్షోభంలో ఉన్నారు. వారు యవ్వనంలో శ్రమ చేసిన కాలాన్ని నిలువునా దోచుకున్న ప్రభుత్వాలకే బాధ్యత లేనప్పుడు ఎవరు వారిని కాపాడగలరు? సీపీఎస్ వాళ్లు తమని ఓపీఎస్‌లోకి మార్చమని ఉద్యమాలు చేస్తున్నారు. ఎన్డీయే, ఇండీ కూటమి ప్రభుత్వాలు జూదమాడుతున్నాయి. కానీ విధాన సమీక్ష చేయడం లేదు. తమకు హక్కుగా రావలసిన, తమ దగ్గర బలవంతంగా మినహాయించుకున్న డబ్బు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను వేధించడం మరొక దుర్మార్గం. మిగులు బడ్జెట్‌తో, అధిక ఆదాయంతో కూడిన తెలంగాణ రాష్ట్రాన్ని తన తప్పుడు ఆర్థిక విధానాలతో కేసీఆర్ అప్పులపాలు చేశారు. ఎవరూ అడగకపోయినా ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 61 సంవత్సరాలకు పెంచేశారు. అంత వయస్సు దాటి రిటైరైన వారికి ఈ ప్రభుత్వం తక్షణ పెన్షన్ మాత్రమే ఇస్తున్నది తప్ప, ఇతరత్రా బకాయిలు ఇవ్వడం లేదు. ఇది పెద్ద సంక్షోభంగా పరిణమించింది. పీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రూప్ ఎల్ఐసి, లీవు నగదు వంటివన్నీ దాచుకున్నవే. గ్రాట్యుటీ మాత్రం సర్వీసు లెక్కించి ఇచ్చేది. కమ్యుటేషన్ అయితే పెన్షనర్లతో ప్రభుత్వం అధిక వడ్డీతో చేసే వ్యాపారం. పదకొండున్నర ఏళ్లలో తీరిపోయే అధిక వడ్డీ మొత్తాన్ని పదిహేనేళ్లు వసూలు చేస్తున్నది. పెన్షన్ అమ్మడం, కొనడం లాభనష్టాల వ్యాపారంగా ప్రభుత్వం నడుపుతున్నది. పెన్షనర్లు పొందే మొత్తం చాలా తక్కువ సమయంలో మార్కెట్‌లోకి వస్తుంది. అన్ని రంగాలలో ఇది ఆర్థిక చలనాన్ని వేగవంతం చేస్తుంది. ప్రభుత్వానికీ మార్కెట్‌కీ ఇది బాగా తెలుసు. పెన్షనర్లు తమ సర్వీసులో దాచుకున్న మొత్తాలు ఒక్కసారిగా తమ ఖాతాలలో జమ అయినప్పుడు పొందే చిన్నపాటి ఆనందం కూడా వారికి మిగలలేదు. ఇవ్వవలసినవన్నీ పెండింగ్‌లో పడేసి, ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు ఇవ్వడం తమ గొప్పగా ప్రభుత్వం చెప్పుకుంటున్నది. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ కించిత్తు కూడా సిగ్గుపడడం లేదు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తమ ఆదాయ మార్గాలను ప్రకటించడం చూస్తున్నాం. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ఆదాయాలు పడిపోతుండగా, సేవారంగ ఆదాయాలు పెరిగినట్టుగా చూపుతున్నాయి. ఈ అన్ని రంగాలకూ అవసరమైన నిపుణత కలిగిన మానవశక్తిని అందించింది వృద్ధతరం కాదా? ప్రభుత్వాలకు ఈ సోయి ఎందుకు ఉండదు? ప్రభుత్వానికి వచ్చే నెలనెలా ఆదాయం అప్పుల అసలు, వడ్డీలకు కట్టవలసి వస్తున్నదని, కొత్తగా చేసే అప్పులన్నీ పాత అప్పుల కిస్తీలకు పోతుంటే ఆదాయం చాలడం లేదని ముఖ్యమంత్రి అంటున్నారు. పాత ప్రభుత్వాన్ని ఇంటికి పంపి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నది ఈ మాటలు వినడానికి కాదు. తల్లిదండ్రులను చూడని కొడుకులూ బిడ్డల ఆదాయాల నుంచి వారి రక్షణ చూస్తామని ప్రభుత్వం చట్టం చేసింది కదా! ఈ చట్టం సారాంశం ప్రభుత్వానికి వర్తించదా? ఏళ్లకేళ్లు ఆలస్యం చేసి చెల్లించే డబ్బు విలువ పడిపోతే ఆ భారాన్ని మోయాల్సింది కూడా వృద్ధులైన పెన్షనర్లే. ఐదేళ్లు రాజకీయాలు చేసుకుని దిగిపోయి, జీవితకాలం పెన్షన్లు పొందే చట్టసభల సభ్యులకు ఈ సమస్య రూపసారాలు ఎందుకు అర్థం కావడం లేదు? పెన్షనర్లు అందరూ ఆఫీసర్లు కాదు. సహజ వనరులు, అధిక ఆదాయాలున్న వారు కాదు. వీరిలో వాచ్‌మెన్లు, అటెండర్లు, రికార్డు అసిస్టెంట్లు, డ్రైవర్లు, పోలీసులు, ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. ఇలాంటివారినా ప్రభుత్వం వేధించేది? పెన్షనర్లకు అప్పుపడ్డ ప్రభుత్వానికి జ్ఞానోదయమవుతుందా?

# మోదీ దూకుడును అడ్డుకునేదెవరు?




తిరుగులేని అధికారం చలాయిస్తున్న ప్రధానమంత్రి ఉంటే సుదీర్ఘ కాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న ప్రయోజనాలు సమకూరుతాయనడంలో సందేహం లేదు. ఈ ఏకఛత్రాధిపత్యం వల్ల వచ్చే నష్టాలు ప్రస్తుతం చర్చనీయాంశం కాదు కానీ, ఉన్నట్లుండి చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమైన ఘట్టంగా భావించక తప్పదు. దీని వల్ల దేశవ్యాప్తంగా చట్ట సభలు మహిళలతో కళకళలాడక తప్పదు. మహిళా చైతన్యానికీ, సాధికారతకు ఇది దోహదం చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండగా బడ్జెట్ సమా వేశాలను పొడిగించి మరీ మధ్యలో ఈ ప్రత్యేక సమావేశాలు ఎందుకు? ఎన్నికలయిన తర్వాత సమావేశాలు ఏర్పాటు చేయొచ్చు కదా? అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి చర్చించవచ్చు కదా అని ప్రతిపక్షాలు ప్రశ్నించడం సహేతుకమే. అయితే గతంలో సర్వం సహా అధికారం చలాయించిన వారు ఇప్పుడు మోదీ ప్రవర్తించిన తీరులోనే వ్యవహరించిన దాఖలాలు లేకపోలేదు. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీ ఇదే విధంగా ప్రవర్తించారు. 1959లో నెహ్రూ కేరళలో ఎన్నికైన కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని రద్దు చేశారు. షాబానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెల్లకుండా చేసేందుకు రాజీవ్‌గాంధీ ముస్లిం మహిళల చట్టాన్ని తీసుకువచ్చారు. అందువల్ల మోదీ కూడా ప్రధానిగా తనకున్న అధికారాలను ఉపయోగించుకుని మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాల్సిందిగా హుకుం జారీ చేయడంలో తప్పేమిటని బీజేపీ నేతలు ప్రశ్నించడానికి ఆస్కారం ఉన్నది. ప్రధాని అధికారాల విషయంలో ప్రతిపక్షాలది అరణ్య రోదన మినహా మరేమీ కాదు. ఇక రాజకీయాల మాటకొస్తే అవకాశం ఉంటే ఏ పార్టీ రాజకీయాలు చేయదు? ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లోనే కాదు, దేశంలో మహిళల మద్దతును పెద్ద ఎత్తున పొందేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మోదీ భావిస్తున్నారు. దేశంలో 50 కోట్ల మంది పురుష ఓటర్లు ఉండగా, 47 కోట్లకు పైగా మహిళా ఓటర్లు ఉన్నారు. గడచిన ఎన్నికల్లో ఓటింగ్ సరళిని చూస్తే ప్రతిసారీ పురుష ఓటర్ల కంటే స్త్రీ ఓటర్లే ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్నారు. పైగా ఎన్నికలకు ముందు మహిళా ఓటర్లను లక్ష్యంగా పెట్టుకుని సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే ఆ ఓటర్లు పెద్ద సంఖ్యలో అధికార పార్టీకి ఓటు వేశారని తేలింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లో ఇదే విధంగా అధికార పార్టీ మహిళలను ఆకట్టుకుంటే, ఇటీవల ఎన్నికలు జరిగిన అస్సాంలో కూడా అన్ని వర్గాల మహిళలకు ఇతోధికంగా నిధుల పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలే మహిళలను ఆకట్టుకుంటున్నప్పుడు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పిస్తే ఇంకెంత రాజకీయ ప్రయోజనం ఉంటుందో అని మోదీ భావించడంలో ఆశ్చర్యం లేదు. త్రిపుల్ తలాఖ్ రద్దు వల్ల ముస్లిం ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారని ఇప్పటికే ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. ఇక ప్రతిపక్షాలు ఈ బిల్లును అడ్డుకుంటే కూడా రాజకీయ ప్రయోజనం పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఈ బిల్లు పేరుతో మహిళలను సమీకరించేందుకు బీజేపీ నేతలు యుద్ధ ప్రాతిపదికన ప్రయత్నాలు మొదలుపెట్టారు. మోదీ వరకొస్తే ఎన్నికల మధ్యలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపడం పెద్ద విషయం కాదు. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పుకుంటున్న అస్సాంలో ఎన్నికలు జరగనే జరిగాయి. పుదుచ్చేరిలో కూడా కూటమి అధికారంలోకి వచ్చేందుకే అవకాశాలు ఉన్నాయి. ఎన్ని బృహత్తర విన్యాసాలు చేసినా కేరళలో ఓట్ల శాతం పెంచుకోవడం తప్ప బీజేపీకి పెద్దగా ఒరిగేది లేదు. ఇక మహిళా రిజర్వేషన్ మూలంగా పశ్చిమబెంగాల్లో కొంత మేరకు మహిళలను తమ వైపునకు తిప్పుకునే అవకాశం లేకపోలేదు. ఆ రాష్ట్రంలో బీజేపీ గణనీయ ఫలితాలు సాధిస్తే మహిళా ఓటర్లు తమకు భారీగా మద్దతిచ్చారని ఆ పార్టీ ప్రకటించవచ్చు. పైగా ఎన్నికలు జరగాల్సిన తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 67 మంది ప్రతిపక్షాల ఎంపీలు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల కోసం మూడు రోజుల పాటు ఢిల్లీలోనే ఉంటే వారి దృష్టిని ఎన్నికల నుంచి ఎంతో కొంత మళ్లించినట్లవుతుంది. ఇక పశ్చిమాసియా పర్యవసానాల నుంచి చర్చను మళ్లించేందుకు కూడా ఈ సమావేశాలు ఉపయోగపడతాయి. ఎటుతిరిగీ ఈ సమావేశాల మూలంగా ఫాయిదా మోదీ సర్కార్‌కే అని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. 'ఆకాశంలో సగం నీవు, అనంత కోటి నక్షత్రాల్లో సగం నీవు, సగం నేను' అన్న కవిత వినడానికి బాగానే ఉంటుంది కానీ, నిజానికి ఇప్పటి వరకూ రాజకీయ పార్టీలు అలంకారప్రాయంగా మహిళా విభాగాలు ఏర్పాటు చేయడం మినహా వారికి రాజకీయ ప్రాతినిధ్యం న్యాయంగా కల్పించిన దాఖలాలు లేవు. లోక్‌సభలో 1999లో మహిళా సభ్యుల సంఖ్య 9 శాతం ఉంటే అది క్రమంగా పెరుగుతూ 14 శాతానికి చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా మహిళా ప్రజా ప్రతినిధుల సగటు శాతం 26.5 కంటే ఇది ఎంతో తక్కువ. స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాజీవ్‌గాంధీ హయాంలో ప్రవేశపెట్టిన బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది కానీ రాజ్యసభలో ఆమోదం పొందలేదు. పీవీ నరసింహారావు హయాంలో కానీ రాజ్యాంగంలోని 72, 73 చట్టసవరణల ద్వారా స్థానిక సంస్థల్లో 33శాతం రిజర్వేషన్ మహిళలకు లభించలేదు. చట్టసభల్లో మహిళలకు 33శాతం ప్రాతినిధ్యం కల్పించేందుకు దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభ తిరస్కరించిన తర్వాత గీతాముఖర్జీ నేతృత్వంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించారు. అయితే ఆ లోక్‌సభ రద్దు కావడంతో బిల్లుకు కాలం చెల్లింది. అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వంలో మళ్లీ ఈ బిల్లును చర్చకు పెట్టేందుకు పలుమార్లు యత్నించారు కానీ సఫలీకృతం కాలేదు. సోనియాగాంధీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పటికీ యుపీఏ హయాంలో బిల్లును ఆమోదించేందుకు యత్నాలు నత్తనడకన సాగాయి. 2010లో రాజ్యసభలో ఆమోదించినప్పటికీ 2014లో లోక్‌సభ రద్దయ్యే వరకూ దాన్ని ప్రవేశపెట్టకపోవడంతో మళ్లీ కాలం చెల్లింది. ఈ బిల్లును ఆమోదించాలని బీజేపీ ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ గట్టిగా వాదించారు కానీ ఓబీసీ, మైనారిటీ, దళిత, ఆదివాసీలకు కూడా కోటా కల్పించాలని సమాజ్‌వాది పార్టీ నేత ములాయంసింగ్ యాదవ్, జనతాదళ్ నేత శరద్ యాదవ్ వాదించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తే జుట్టు కత్తిరించుకున్నవారు, పట్టణాల్లో నివసించే మహిళలు చట్టసభల్లో ప్రవేశిస్తారని శరద్ యాదవ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో గతంలో తీసుకున్న అన్ని నిర్ణయాలను పక్కన పెట్టి మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకుగాను ఆగమేఘాలపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసినందుకు మోదీ దూకుడును ఎందుకు వ్యతిరేకించాలి? ఈ దేశంలో ఎవరికీ న్యాయ సమ్మతంగా వారికి దక్కాల్సింది దక్కదు. దళితులకు, ఆదివాసీలకు రాజ్యాంగం రిజర్వేషన్ కల్పించకపోతే బహుశా వారికి కూడా సీట్లు కేటాయించేవారు కాదేమో. బీసీలు కూడా చాలాకాలంగా తమకు సామాజిక న్యాయం కావాలని పోరాడుతున్నా వారికి దక్కాల్సిన వాటా దక్కడం లేదు. అలాగే సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల విషయాన్ని చూడండి. స్వాతంత్ర్యం తర్వాత 268 మంది న్యాయమూర్తులు ఉంటే వారిలో మహిళలు ఇప్పటి వరకూ కేవలం 11 మంది మాత్రమే! స్వాతంత్ర్యం తర్వాత 39 సంవత్సరాలకు గానీ తొలి మహిళా న్యాయమూర్తిని నియమించలేదు. స్వాతంత్ర్యం వచ్చిన ఎనిమిది దశాబ్దాలకు 2027లో ఒక మహిళ ప్రప్రథమంగా ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు స్వీకరించనున్నారు. అది కూడా ఆమె 36 రోజులు మాత్రమే ఆ అత్యున్నత పదవిలో ఉంటారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాక మోదీ ప్రభుత్వం న్యాయవ్యవస్థలో కూడా మహిళల ప్రాతినిధ్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందేమో! 2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కు పెంచాలని మోదీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జనాభా లెక్కల ప్రకారమే 1952లో, అనంతరమూ లోక్‌సభ సీట్లను పెంచారు. ఆ తర్వాత ఆ సీట్ల సంఖ్యను పెంచకుండా స్తంభింపజేశారు. తొలుత 2026 జనాభా లెక్కల ప్రకారం సీట్లను పెంచాలనుకున్నారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని లోక్‌సభ సీట్లను 850కు పెంచాలని నిర్ణయించారు. ఈ పెంపుదలలో శాస్త్రీయత లేదని, దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు, ఉత్తరాది రాష్ట్రాలకు మధ్య సీట్ల విషయంలో అగాధం పెరుగుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఒక్క ఉత్తరాది రాష్ట్రాలు, గుజరాత్‌లో చక్రం తిప్పితే చాలు, బీజేపీకి సునాయాసంగా 330కి పైగా సీట్లు లభిస్తాయి. ఇక ఇతర చోట్ల, స్వంతంగా, పొత్తులు పెట్టుకుని మరో వంద సీట్లు సాధిస్తే ఆ పార్టీకి తిరుగుండదని, అప్పుడు బీజేపీయేతర రాష్ట్రాలను పట్టించుకునే నాథుడే ఉండడని ప్రతిపక్ష శిబిరంలో కొందరు వాపోతున్నారు. సమాఖ్య స్ఫూర్తికి వాటిల్లనున్న ప్రమాదంపై డీఎంకే అధినేత స్టాలిన్ ఇప్పటికే తుది హెచ్చరిక జారీ చేశారు. ఏమైనా మహిళా రిజర్వేషన్ల కంటే డీలిమిటేషన్ విషయమే పార్లమెంటును రణరంగంగా మార్చే అవకాశం కనిపిస్తోంది. ఈ దేశంలో కీలక నిర్ణయాలను సామరస్యపూర్వకంగా, సంప్రదింపులతో తీసుకునే అవకాశాలేవీ లేవా? ప్రతి నిర్ణయాన్ని బుల్డోజింగ్ ద్వారా అమలు చేయాలనుకోవడం సరైనదేనా?

## నవ భారత నిర్మాణానికి నారీశక్తి ఊతం!




మహిళా సాధికారత సనాతన భారతంలో కొత్త భావన కాదు. మన సంస్కృతిలో ఇది వేల ఏళ్లుగా ఉన్న ఆచరణ. వేదకాలంలో మహిళలు జ్ఞానంలో, ధర్మంలో, సమాజ నిర్మాణంలో, అభివృద్ధిలో, వేదాంత చర్చలలో ప్రధాన పాత్ర పోషించారు. ఉభయ భారతి, గార్గి, మైత్రేయి వంటి మహానుభావురాళ్లు సమాజానికి మార్గదర్శకులయ్యారు. "యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః" అనే భావం మహిళలకు భారత సంస్కృతిలో ఉన్న గౌరవాన్ని స్పష్టం చేస్తోంది. కాలక్రమేణా విదేశీ దాడులు, సామాజిక మార్పులు, వలస పాలన వంటి కారణాల వల్ల మహిళల స్థానం క్రమంగా తగ్గింది. స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగం సమానత్వాన్ని ఇచ్చినా, రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం తక్కువగానే ఉంది. మహిళా రిజర్వేషన్ గురించి ఎన్నో దశాబ్దాలుగా చర్చలు జరిగాయి కానీ అమలు కాలేదు. ఈ లోటు ప్రజాస్వామ్యంలో అసమతుల్యతను కలిగించింది. 2023 సెప్టెంబర్ 19న మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సెప్టెంబర్ 20న లోక్‌సభ ఆమోదించింది, సెప్టెంబర్ 21న రాజ్యసభలో ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో ఇది చట్టంగా మారింది. ఈ చరిత్రాత్మక నిర్ణయం భారత రాజకీయ చరిత్రలో ఒక కీలక మలుపు. భారత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఈ బిల్లు కేవలం ఆమోదం పొందడమే కాదు, ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మరింత స్పష్టతతో అమలు దిశగా ముందుకు సాగింది. తన ప్రసంగంలో మోదీజీ మహిళా శక్తిని దేశ అభివృద్ధికి కీలక శక్తిగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం సుమారు 14శాతం మాత్రమే ఉండేది. రాష్ట్ర అసెంబ్లీలలో ఇది సాధారణంగా 8శాతం నుంచి 10శాతం మధ్యలోనే ఉంది. ఈ సంఖ్యలు మన దేశంలో ఉన్న లోటును స్పష్టంగా చూపిస్తున్నాయి. కానీ ఇప్పుడు అమలు కాబోతున్న 33శాతం ప్రపంచంలోనే భారత మహిళను శక్తిమంతం చేస్తుంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ద్వారా ఈ బిల్లును వేగంగా ముందుకు తీసుకెళ్లడం, 2029 నాటికే అమలు దిశగా స్పష్టమైన సంకల్పాన్ని చూపిస్తోంది. ఇది కేవలం చట్టపరమైన ప్రక్రియ కాదు, ఇది ఒక దిశానిర్దేశం. మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం సంఖ్యల విషయం కాదు. ఇది పాలనలో నాణ్యతను పెంచే అంశం. మహిళలు సమాజ సమస్యలపై లోతైన అవగాహనతో, సున్నితమైన దృక్పథంతో నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం, విద్య, సంక్షేమం వంటి ముఖ్య రంగాల్లో మరింత సమగ్రమైన విధానాలు అమలవుతాయి. ఈ బిల్లుతో సామాజికంగా మహిళల భద్రత, గౌరవం, హక్కులపై మరింత దృష్టి పెరుగుతుంది. ఆర్థికంగా మహిళల భాగస్వామ్యం పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. పాలనలో సమానత్వం పెరిగి ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. సాంస్కృతికంగా కూడా ఇది మన పురాతన విలువలకు అనుగుణంగా "శక్తి" భావనను మళ్లీ స్థాపిస్తుంది. ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు మన సంస్కృతి, ఆధునికతల మధ్య ఒక బలమైన సేతువుగా నిలుస్తోంది. ఇది కేవలం స్థానాల కేటాయింపు కాదు. ఇది సమానత్వానికి, శక్తిమంతమైన భారత నిర్మాణానికి ఒక దిశా నిర్దేశం.

– సాదినేని యామినిశర్మ

# ప్రజాస్వామ్యంలో మహిళ గళం... పరివర్తనకు సమయం ఆసన్నం

## మహిళా రిజర్వేషన్లు: ప్రజాస్వామ్య పరివర్తనపై ప్రభావం: శోభా కరంద్లాజే



హైదరాబాద్ ఏప్రిల్ 15 నిర్భయవార్త స్పెషల్ కరెస్పాండెంట్ : సహాయ మంత్రిగా నేను ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, కిక్కిరిసి ఉన్న ఆ గదిలో ఎంత మంది మహిళలు ఉన్నారో లెక్కపెట్టాను. వేళ్ల మీద లెక్కపెట్టేంత మంది మాత్రమే కనిపించారు. అది నా మనసుపై చెరగని ఓ ముద్రను వేసింది. ఆ సందర్భం వ్యక్తిగత విజయంగా కాకుండా... రాజకీయాల్లో మహిళలు ఇంకా చేరుకోవాల్సిన సుదూర గమ్యానికి స్పష్టమైన సూచనగా నిలిచింది.కర్ణాటక కోస్తా తీరంలో పుత్తూరుకు సమీపంలోని ఓ కుగ్రామం నుంచి నేను వచ్చాను. అది మహిళలు తమ స్థైర్యాన్ని, సామర్థ్యాన్ని ప్రదర్శించే సుసంపన్నమైన సంప్రదాయాలున్న ప్రాంతం. ఈ బలాన్ని ప్రజాజీవితంలోకి తీసుకువచ్చేలా అతి తక్కువ మంది ఎంచుకొనే మార్గంలో నడవడమంటే ఏమిటో నాకు తెలుసు. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన అవకాశం ప్రతి మహిళకూ లభించదని కూడా తెలుసు.నారీశక్తి వందన్ అధీనియం బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది. 2023 సెప్టెంబరులోనే పార్లమెంటు దీనిపై చర్చించింది. రాజ్యాంగ సవరణ జరిగింది. కానీ ఆ మాటను నిలబెట్టుకోవడమనే అతి కష్టమైన పని ఇప్పుడు మొదలవుతోంది.

ప్రజలకు ప్రాతినిధ్యం వహించేదే ప్రజాస్వామ్యం భారత్‌లో 670 మిలియన్ల మంది మహిళలున్నారు. ఈ జనాభాలో కేవలం 15 శాతానికి మాత్రమే ప్రాతినిధ్యం లభిస్తోంది. నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియలకు సగం మంది పౌరులను దూరంగా ఉంచే ప్రజాస్వామ్యాన్ని నిజమైన ప్రజాస్వామ్యంగా పరిగణించలేం. అది ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉంటుంది. ఈ పనిని పూర్తి చేసే దిశగా సాధించిన విజయమే నారీశక్తి వందన్ అధీనియం. దీనిని సమర్థంగా అమలు చేయకపోతే.. ఈ చట్టానికి పెద్దగా విలువ ఉండదు. జనాభా లెక్కలు పూర్తయిన అనంతరం, పునర్విభజన జరగాలి. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో మూడో వంతు సీట్లు మహిళలకు దక్కాలి.

చట్టాల రూపకల్పనలో మహిళలు భాగమైనప్పుడు.. శాసన వ్యవస్థ దృష్టి కోణం మారుతుంది. దశాబ్దాల కిందట మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన పంచాయతీ రాజ్ సంస్థలు.. తమ ప్రాధాన్యాల్లో వచ్చిన మార్పులను ప్రదర్శిస్తున్నాయి. నీరు, ఆరోగ్యం, విద్య, పిల్లలకు పోషకాహారానికి అధిక నిధులు కేటాయించాయి. అవినీతి తగ్గి జవాబుదారీతనం పెరిగింది. ఇది యాదృచ్ఛికం కాదు. ప్రాతినిధ్య ప్రభావాన్ని ఆచరణలో చూపించడమే.

వలయాన్ని ఛేదించడం

మహిళలు "తమ సొంత ప్రతిభతో రాణించాలి" అనే వాదనను నేను విన్నాను. దానిని గౌరవిస్తాను. కానీ, అంగీకరించను. శూన్యంలో ప్రతిభ రాణించలేదు.అవకాశం లభించిన చోటే అది వికసిస్తుంది. సామాజిక ఆర్థిక, సాంస్కృతిక అవరోధాలు.. తెలివైన మహిళలను రాజకీయాల నుంచి తరాల పాటు దూరంగా ఉంచాయి. విస్తృతమైన పలుకుబడి, పరిచయాలు, రాజకీయ వారసత్వం ఉన్నవారికి, ఇంటి బాధ్యతలకు దూరంగా ఉన్నవారికి మాత్రమే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అనుకూలంగా ఉండేది. అదే సమయంలో ఇలాంటి సానుకూలతలేవీ మహిళలకు లేవు.

రిజర్వేషన్లు ప్రమాణాలను తగ్గించవు... అడ్డంకులను తొలగిస్తాయి

పెద్ద సంఖ్యలో మహిళలు పంచాయతీల్లోకి అడుగుపెట్టిన కొత్తల్లో వారిని చిన్నచూపు చూశారు. అయితే, అనేక అధ్యయనాల తర్వాత... సమాన హోదాలో ఉన్న పురుషులతో పోలిస్తే అత్యంత సమర్థులుగా, అందరికీ అందుబాటులో ఉండేవారిగా, నిజాయతీ పరులుగా మహిళలను వారి సమాజాలు గుర్తించాయి. సరైన అవకాశం లభించినప్పుడు మహిళలు తమ భాగస్వామ్యాన్ని అందించడమే కాకుండా... ముందుండి నడిపిస్తారు.

విధాన పరంగా దీని అర్థమేంటంటే...

చర్చలో భాగమైన వారు మాత్రమే ఏం చర్చించాలనే అంశాన్ని నిర్దేశిస్తారని ప్రభుత్వంలో నా విస్తృత అనుభవం నాకు నేర్పింది. ప్రసూతి ఆరోగ్యానికి సంబంధించిన నిధుల్లో కోతలు విధించకుండా శాసన వ్యవస్థల్లోని మహిళా సభ్యులు ఒత్తిడి తీసుకువస్తారు. విధానాల ఆచరణలో మహిళలపై తీవ్ర ప్రభావం చూపే లింగపరమైన సమస్యలను ఎత్తి చూపుతారు. పురుష సభ్యుల దృష్టికి రాని నియోజకవర్గ సమస్యలను వారు వెలుగులోకి తీసుకు వస్తారు.మొదటిసారిగా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు కల్పించే 33 శాతం రిజర్వేషన్లు అంటే స్త్రీల గొంతుక నిర్మాణాత్మకమైనదిగా, శాశ్వతమైనదిగా, విస్మరించడానికి వీల్లేనిదిగా ఉంటుందని అర్థం.

నారీశక్తి: లక్ష్యం నుంచి చట్టం వరకు

మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించకపోతే... తన పూర్తి సామర్థ్యాన్ని భారత్ వినియోగించుకోలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చాలా కాలంగా చెబుతున్నారు. ఇది మాటలతో సరిపెట్టడం కానే కాదు. బేటీ బచావో బేటీ పఢావో నుంచి జన్ ధన్, ఉజ్వల, పీఎం ఆవాస యోజనలో మహిళలను రికార్డు స్థాయిలో భాగస్వాములను చేసేంత వరకు ఒకదాని తర్వాత ఒకటిగా విధానాల అమలులో ఆ దృఢ విశ్వాసం కనిపిస్తుంది. నారీశక్తి కేవలం నినాదం కాదని, అది వికసిత్ భారత్‌కు పునాది అని ఆయన నిరంతరం చెబుతూనే ఉన్నారు. ఈ దార్శనికతకు సంపూర్ణ రూపమే నారీశక్తి వందన్ అధీనియం. ఇది సంక్షేమం నుంచి పరిపాలన వ్యవస్థల వరకు అన్నింటా మహిళా సాధికారతను అంతర్భాగంగా మారుస్తుంది.

పార్టీలకు అతీతంగా నా తోటి సభ్యులకు విజ్ఞప్తి

ఇది ఏ ఒక్క పార్టీకో చెందిన అంశం కాదు. మనందరికీ సంబంధించినది. పార్లమెంటు వ్యవస్థకు చెందింది. ప్రభుత్వంలోని ప్రతి స్థాయిలో ఈ దేశానికి సేవలందించిన మహిళగా నేను అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. మరింత బలమైన, పరిపూర్ణమైన ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఎదగాలనే కోరిక మనందరికీ ఉందని నేను నమ్ముతున్నాను. తక్షణమే భారతీయ మహిళలకు మనం అందించాల్సింది ఏంటంటే... జనగణనను పూర్తిచేయడం, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం, ఈ క్రమంలో ఒక్క రోజును కూడా వృథా చేయకుండా ఉండటం.

ఈ చట్టం అమలు, రొటేషన్ విధానంలో సీట్ల రిజర్వేషన్లు, నామమాత్రపు అభ్యర్థులు, కాలపరిమితి ఉన్న నిబంధనలకు సంబంధించిన ఆందోళనలను నేను అర్థం చేసుకోగలను. ఇవి న్యాయబద్ధమైన చర్చలే. వీటిపై తక్షణమే దృష్టి సారించేలా మనం చూడాలి. ఈ చట్టం సరైనది. అత్యవసరంగా చేపట్టాల్సినది. పరిపూర్ణత్వం కోసం ప్రయత్నిస్తూ... విప్లవాత్మకమైన మార్పులను అడ్డుకోవద్దు.

న్యాయాన్ని ఎంచుకున్న దేశం

2023 సెప్టెంబరులో చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. అనంతరం ఎదురయ్యే పరిణామాల వల్లే దానికి అర్థం చేకూరుతుంది. న్యాయాన్ని ఎంచుకున్న దేశం తాను ఆమోదించిన చట్టాలకు కట్టుబడి ఉంటూ... నిశ్శబ్దంగా, శాశ్వతంగా నిలిచిపోయేలా తన బాధ్యతను నిర్వర్తిస్తుంది. ఈ దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించే ప్రతి యువతికీ, ఇంత వరకూ అవకాశం లభించని ప్రతి నాయకురాలికి, ఎన్నడూ మైక్రోఫోన్ అందుకోని గొంతుకకు ముందడుగు వేసేందుకు తగిన సమయం ఆసన్నమైంది. ఈ చట్టాన్ని అమలు చేద్దాం. అవకాశాలను విస్తరిద్దాం. దేశం మనల్ని గమనిస్తోంది.

# మండల స్థాయి సభలను విజయవంతం చేయాలి

రంగారెడ్డి ఏప్రిల్, 15 నిర్భయవార్త జిల్లా బ్యూరో :ఏప్రిల్ 16 నుండి నిర్వహించే మండల స్థాయి సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులు, ఆర్డీఓలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మండల వార్డు సభలు సమర్ధవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ సూచన మేరకు, జిల్లాలో ప్రతి మండలంలో పాఠశాల/ మండల కార్యలయం/బహిరంగ ప్రదేశం/ ఏదైనా ఇతర అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు మండల స్థాయి సభలను ప్రారంభించాలని, మండల స్థాయి సభలలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, గౌరవ మంత్రులకు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, సభలను రాష్ట్ర గీతంతో ప్రారంభించాలని, గౌరవ ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చదివి వినిపించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ అభివృద్ధి పథకాల పై చర్చించాలని, మండల స్థాయి సభలలో తహశీల్దార్, ఎంపిడిఓ, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని సూచించారు. మహిళలు వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, ప్రదర్శన కోసం స్క్రీన్ మరియు ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలని, వేసవి కాలం అయినందున త్రాగునీరు, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సభ బ్యానర్ ప్రదర్శించాలని సూచించారు. అధికారులు అందరూ సమన్వయంతో



పని చేసి మండల స్థాయి సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, సిపిఓ సౌమ్య, జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఆకస్మిక తనిఖీ





బాలానగర్,నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాలానగర్ పరిధిలోని ఎన్ఎస్‌కేకే పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ (ఐఏఎస్) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ) విజయకుమారి కూడా పాల్గొన్నారు.తనిఖీలో భాగంగా అదనపు కలెక్టర్ మూల్యాంకన ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు జారీ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమాధాన పత్రాల మూల్యాంకనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలర్లు వంటి కనీస సౌకర్యాలను సమకూర్చాలని సూచించారు.అలాగే, నిర్దేశిత గడువులోగా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసి ఫలితాల విడుదలకు సహకరించాలని కోరారు. వాల్యుయేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలని, అనధికార వ్యక్తులు లోపలికి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో స్పాట్ క్యాంప్ అధికారులు, సహాయక సిబ్బంది, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్ మను చౌదరి సూచనలు



మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ (హీట్ స్ట్రోక్) నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన జాగ్రత్తలను పాటించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో సూచించారు. వడగాలుల ప్రభావాన్ని తగ్గించేందుకు చేయవలసినవి, చేయకూడనివి గురించి ప్రజలకు మార్గదర్శకాలు విడుదల చేశారు.ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంటి బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఉల్లిపాయ సలాడ్, ఉప్పు--జీలకర్రతో పచ్చి మామిడి వంటి సాంప్రదాయ పద్ధతులు వడదెబ్బ నివారణకు సహాయపడతాయని తెలిపారు. దాహం లేకపోయినా తగినంత నీరు త్రాగడం అలవాటు చేసుకోవాలని చెప్పారు.శరీరాన్ని డీహైడ్రేషన్ నుంచి కాపాడేందుకు ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీరు, లస్సీ, బియ్యం నీరు (తోరణి) వంటి పానీయాలను తీసుకోవాలని సూచించారు. తేలికపాటి, లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం మంచిదన్నారు.బయటకు వెళ్లినప్పుడు తలను గుడ్డ, టోపీ లేదా గొడుగుతో కప్పుకోవాలని, కళ్ల రక్షణకు సన్‌గ్లాసెస్, చర్మానికి సన్‌స్క్రీన్ ఉపయోగించాలని తెలిపారు. తరచూ చల్లటి నీటితో స్నానం చేయడం, ఫ్యాన్లు వాడటం ద్వారా శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకోవచ్చని పేర్కొన్నారు.పిల్లలు, పెంపుడు జంతువులను మూసి ఉన్న వాహనాల్లో ఒంటరిగా వదిలిపెట్టకూడదని హెచ్చరించారు. ఇంటికి లేదా కార్యాలయానికి వచ్చే డెలివరీ సిబ్బంది, విక్రేతలకు తాగునీరు అందించాలని, ప్రజా రవాణా లేదా కార్‌పూలింగ్ ఉపయోగించడం ద్వారా వాతావరణంపై ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జలాశయాలను సంరక్షించడం, వర్షపు నీటిని సేకరించడం, ఎండు ఆకులు లేదా చెత్త కాల్చకూడదని సూచించారు. తల తిరగడం, అస్వస్థత అనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య ఎండలో బయటకు వెళ్లకూడదని, శ్రమతో కూడిన పనులను నివారించాలని తెలిపారు. చెప్పులు లేకుండా బయటకు వెళ్లడం మానుకోవాలని సూచించారు.శరీరాన్ని నిర్జలీకరణం చేసే మద్యం, టీ, కాఫీ, కార్బొనేటెడ్ పానీయాలకు దూరంగా ఉండాలని, అధిక ఉప్పు, కారం, నూనె, ప్రోటీన్ ఉన్న ఆహారాన్ని తగ్గించాలని చెప్పారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో వంట చేయడం మానుకోవడం, వంటగదిలో గాలి సరిగా వచ్చేందుకు తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలని సూచించారు.గర్భిణీలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కంప్యూటర్లు, ప్రకాశవంతమైన లైట్లు వంటి అధిక వేడి ఉత్పత్తి చేసే పరికరాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.

అవగాహనతోనే రక్షణ


ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్ర వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ సూచనలను పాటిస్తే వడదెబ్బ వంటి ప్రమాదాలను నివారించవచ్చని కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. జిల్లాలో విపత్తులు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా డాక్టర్ యార్రమాద కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



ప్రకాష్ టైమ్స్ న్యూస్/ నల్గొండ, ఏప్రిల్ 15: సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యార్రమాద కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.సమాచార హక్కు వికాస సమితి కార్యాలయంలో జరిగిన.ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారెడ్డిని శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన సమాజ సేవా కార్యక్రమాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్గం సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గడగోజు విజయకుమార్, రామకృష్ణ, నాగేష్, చిత్రం శ్రీను, దశరథ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నగర శివారు ప్రాంతాల్లో బస్సులు ఆపాలి: సీపీఎం



ప్రకాష్ టైమ్స్ న్యూస్/నల్గొండ, ఏప్రిల్ 15:నగర శివారు ప్రాంతాలు, కాలనీల వద్ద బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ట్రాఫిక్ సీఐ మామిడి హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ నల్లగొండ నగర శివారు ప్రాంతాల్లో దేవరకొండ రోడ్డులో వినాయక హౌసింగ్ బోర్డ్, కతాల్‌గూడ, మిర్యాలగూడ రోడ్డులో రామ్‌నగర్, కేశరాజుపల్లి, హైదరాబాద్ రోడ్డులో మర్రిగూడ, చర్లపల్లి, మునుగోడు రోడ్డులో గుండ్లపల్లి ఎక్స్‌రోడ్, సూర్యాపేట రోడ్డులో కాజీరామారం స్టేజ్ వద్ద రిక్వెస్ట్ బస్టాప్ బోర్డులు ఏర్పాటు చేసి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని కోరారు.అలాగే ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులు కూడా ఆపకపోవడంతో విద్యార్థులు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ బస్సుల సంఖ్య తగ్గించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి నగర శివారు ప్రాంతాల్లో బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, అద్దంకి నరసింహ, కన్నెకంటి సత్యనారాయణ, ఎండి సర్దార్ అలీ, జంజరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 2024 నుండి పెండింగ్ లో ఉన్న బిఎల్ఓ డ్యూటీల డబ్బులు చెల్లించాలి

## బిఎల్ఓ డ్యూటీల నుండి అంగన్వాడీ టీచర్స్ ను మినహాయించాలి సి ఐ టి యు.

## అంగన్వాడి జిల్లా కార్యదర్శి జి. పద్మ.




చర్ల ఏప్రిల్ 15 నిర్భయ వార్త ప్రతినిధి.: 2024 నుండి పెండింగ్ లో ఉన్న (బి ఎల్ ఓ ) బూతు లెవెల్ డ్యూటీలు చేసిన బ్బులు ఇవ్వాలనిబి ఎల్ ఓడ్యూటీల అంగన్వాడీ టీచర్స్ నీ మినహాయించాలని అంగన్వాడి జిల్లా కార్యదర్శి జి పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సి ఐ టి యు ఆధ్వర్యంలో చర్ల ఎం ఆర్ ఓ ఆఫీస్ ముందు ధర్నా ఆనంతరం ఎం ఆర్ ఓ కి వినతిపత్రం ఇవ్వడం జరిగినది వారు స్పందిస్తూ పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ సందర్భంగా అంగన్వాడీ జిల్లా కార్యదర్శి జి పద్మ మాట్లాడుతూ బూతు లెవల్ డ్యూటీ ల చేస్తున్న అంగన్వాడి టీచర్స్ ను అధికారులు ఎప్పుడు పడితే అప్పుడు ఫోన్ చేసి ఓటు చేర్పింపులు మార్పులు డిలీటెడ్ ఆధార్ కార్డులు పాస్ పోటోలు కొష్ట పామ్ 7ష్ట పామ్ కొష్ట ప్రతీ రోజు ఒక ఇంటి చుట్టూ రెండు మూడు సార్లు తిరగాల్సి వస్తుందని చెప్పే పని ఒకేసారి చెప్పకుండా ఒకే పనిని రెండు మూడు సార్లు గుర్తొచ్చినప్పుడల్లా చెబుతూ ప్రతిరోజు రెండుసార్లు ఎమ్మార్వో ఆఫీస్ లో చుట్టూ తిప్పించుకుంటున్నారని ఇలా తిరగడం వల్ల అంగన్వాడీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆటో కిరాయి లు ఎక్కువ సంఖ్యలో ఖర్చవుతున్నా యని అధికారులు మాత్రం ఎన్నిసార్లైనా వినతి పత్రం ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం సరైన కాదని అన్నారు ఒకపక్క ఐసిడిఎస్ పనులు మరోపక్క బిఎల్ఓ డ్యూటీలు చేస్తున్నారని ఇన్ని పనులు చేసినా అంగన్వాడీలకు 2024 నుండి చేసిన డబ్బులు చెల్లించకపోవడం సరైనది కాదని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 2024 నుండి పెండింగ్లో ఉన్న బిఎల్ఓ డబ్బులు ఇవ్వాలని బి ఎల్ వో డ్యూటీలు ఇతర డిపార్ట్మెంట్ కు మీనాయించాలని అధికారుల బెదిరింపులు ఆపాలని ఏదైనా సమాచారం కావాలంటే అధికారులే మా దగ్గరికి వచ్చి తీసుకొని వెళ్లా లని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మచ్చ రామారావు అంగన్వాడి సిఐటియు మండల కన్వీనర్ పాయం రాధాకుమారి అంగన్వాడి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏం విజయశీల పాల్గొన్నారు.

# చదువే పేదరికాన్ని దూరం చేస్తుంది.

**చదువులకు దాతల సహకారం మరువలేనిది.**
**వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ ఆశాలత.**



చర్ల, ఏప్రిల్ 15 నిర్భయ వార్త ప్రతినిధి : చదవే పేదరికాన్ని పారద్రోలుతుందని, విద్యార్థుల చదువులకు దాతల సహకారం మరువలేనిదని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర సుక్మా జిల్లా కుంట గ్రామానికి చెందిన ఇందన అప్పారావు జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు ఇందన రాంబాబు – వరలక్ష్మి దంపతులు వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్స్ అందచేసారు. ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయం ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాలత పాల్గొని విద్యార్థులను ఉద్దేసించి ప్రసంగించారు. ప్రతి విద్యార్థి చదువులపై దృష్టి సారించాలని, చదువుతోనే పేదరికం దూరమవుతుందన్నారు. ఇందుకు మనకు అనేక ఉదాహరణలు కనపడుతున్నాయని, వారిని ఆదర్శంగా తీసుకొని చదువులపై దృష్టి సారించింది ఉన్నత స్తితికి చేరుకోవాలని విజ్ఞప్తి చేసారు. పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తున్న ప్రతి ఒక్కదాతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే విద్యార్థులు ఇందుకు అనుగుణంగా ప్రవర్తించి తల్లిదండ్రులతో పాటు సంస్థకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నిలయ కమిటీ అధ్యక్షుడు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, వనవాసీ జిల్లా సహ సంఘటనా కార్యదర్శి గొంది శోభన్‌బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

# గీతంలో 'సంభాషణ, ప్రభావం'పై ఒకరోజు కార్యశాల



ప్రకాష్ టైమ్స్ న్యూస్/హైదరాబాద్, ఏప్రిల్ 15:గీతం డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంలోని విద్యా ఆవిష్కరణ, పురోగతి కేంద్రం (సీఏఐఏ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 21న 'సంభాషణ, ప్రభావం' అంశంపై ఒకరోజు స్వీయ నైపుణ్యాల పెంపుదల కార్యశాల నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.సీఏఐఏ ప్రతినిధి మోసెస్ కొటికెల మాట్లాడుతూ, విద్యా వాతావరణాలలో నాయకత్వానికి అవసరమైన కీలక నైపుణ్యాలలో సమర్థవంతమైన సంభాషణతో పాటు ప్రభావితం చేసే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యశాల లక్ష్యమన్నారు. ఈ నైపుణ్యాలు నాయకులకు విభిన్న భాగస్వాములను ఏకం చేయడంలో, విశ్వాసాన్ని పెంపొందించడంలో, సంస్థాగత దృక్పథాన్ని కార్యరూపంలోకి తీసుకురావడంలో దోహదపడతాయని తెలిపారు.విద్యా రంగంలో మార్పులు తీసుకురావడం, విభేదాలను పరిష్కరించడం, సహకారాన్ని పెంచడం, వ్యక్తులను ప్రేరేపించడం వంటి అంశాలలో ఈ నైపుణ్యాలు కీలకమని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ నాయకులు సంస్థకు బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేస్తారని, అధ్యాపకులు, విద్యా నాయకులు తమ ప్రతినిధ్యాన్ని మరింత మెరుగుపరచడంపై ఈ కార్యశాల దృష్టి సారిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా 'అకడమిక్ ఇంపాక్ట్ కోసం కథలు చెప్పడం' అనే అంశంపై ప్రత్యేక మాస్టర్ క్లాస్ నిర్వహించనున్నారు. ఉపన్యాసాలు, ప్రజెంటేషన్లు మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా మార్చే పద్ధతులను ఇందులో వివరించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సంస్థ బలాలను సమర్థవంతంగా ప్రదర్శించే విధానాలను కూడా పాల్గొనేవారికి తెలియజేస్తారు.తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచే ఆచరణాత్మక వ్యూహాలు, అభ్యాస అనుభవాలను సుసంపన్నం చేసే విధానాలు కూడా ఈ కార్యక్రమంలో భాగంగా ఉంటాయి. కోహెన్–బ్రాడ్ ఫోర్డ్ ప్రభావ నమూనా వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఈ కార్యశాల ముఖాముఖి పద్ధతిలో నిర్వహించబడుతూ, వాస్తవ జీవిత ఉదాహరణలు, చర్చలు, ఆత్మపరిశీలన వ్యాయామాలతో సమన్వయం చేయబడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యశాలలో ప్రధాన వక్తగా నాయకత్వం, ప్రవర్తనా సలహాదారు జూజర్ శుక్లా హస్తక్ పాల్గొననున్నారు. ఐటీ, తయారీ, బీఎఫ్ఎస్ఐ, ఫార్మా, విద్యారంగాలలో 26 సంవత్సరాల అనుభవంతో ఆమె ఆచరణాత్మక అవగాహనను పంచుకోనున్నారు.

## డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ అసత్య ప్రచారం: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు





వరంగల్, ఏప్రిల్ 15: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు.

2011 జనాభా లెక్కలే ప్రామాణికం

నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. 'సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు.

'హైబ్రిడ్ సిస్టమ్' ఒక వింత ప్రయోగం

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ×.చీ.ణ.×ూ కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. 'నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలి.' అని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన ప్రక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# 21న న్యూడెమోక్రసీ జిల్లా సదస్సు

## విజయవంతానికి బైక్ ర్యాలీ



ప్రకాష్ టైమ్స్ న్యూస్/సూర్యాపేట, ఏప్రిల్ 15:ఈ నెల 21న సూర్యాపేట జిల్లా కేంద్రంలో సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కొత్త బస్టాండ్, శంకర విలాస్, కోర్టు, పిఎస్ఆర్ సెంటర్ మీదుగా వాణిజ్య భవన్ వరకు సాగింది. ర్యాలీ సందర్భంగా పార్టీ నాయకులు నినాదాలతో సదస్సుకు ప్రజలను ఆహ్వానించారు.ఈ సందర్భంగా సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పలు చట్టాలలో మార్పులు చేస్తూ సాధారణ ప్రజలను ఆర్థికంగా బలహీనులను చేస్తున్నారని ఆరోపించారు.విద్యుత్ ప్రైవేటీకరణ, నూతన విత్తన చట్టం, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నెల 21న జరిగే జిల్లా సదస్సుకు ఐఎఫ్టియు జాతీయ కార్యదర్శి టి. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పార్టీ నాయకులు అలుగుబెల్లి వెంకటరెడ్డి, దాసరి శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, సామ నర్సిరెడ్డి, కొండేటి సంజీవరెడ్డి, పివైఎల్ జిల్లా అధ్యక్షులు నల్గొండ నాగయ్య, కోశాధికారి బండి రవి, వీరబోయిన రమేష్, బయ్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ జీహాదీలో కొత్త కోణాలు..


నాసిక్, ఏప్రిల్ 15, నిర్భయవార్త : మహారాష్ట్రని కుదిపేసిన నాసిక్ బీపీవో లైంగిక వేధింపుల అంశంలో పోలీసులు చాలా పక్కాగా వ్యవహరించారు. దాదాపు 150మంది వరకూ పనిచేస్తున్న ఆ ఃఖాలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు రావడంతో నిజాన్ని నిర్ధారించుకోవడానికి పోలీసులు అండర్ కవర్ ఆపరేషన్ చేశారు. కొన్ని రోజులు అక్కడ పనిచేసి నిజాలు నిర్ధారించుకున్న తర్వాతే ఎఫ్ ఐఆర్ లు నమోదు చేశారు. మహారాష్ట్ర నాసిక్‌లోని మహిళా ఉద్యోగులపై వేధింపులు, ఉద్యోగ ప్రలోభాలు, మతపరమైన ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణలు రావడం సంచలనం రేకెత్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే తొమ్మిది లు నమోదు కాగా ఏడుగురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో ఎక్కువ మంది ఓ మతానికి చెందిన వారుండటం, వారు బలవంతపు మతమార్పిడికి ప్రయత్నించారన్న ఫిర్యాదు రావడంతో విషయం సున్నితంగా మారింది. రైట్ వింగ్ రాజకీయ పార్టీలు ఇది లవ్‌జిహాద్‌లాగా కార్పోరేట్ జిహాద్ అని అభివర్ణించాయి. బలవంతపు మతమార్పిడిలకు కార్పోరేట్ ఆఫీసులను కూడా ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే ఈ వ్యవహారం ముందుగా బయటకు వచ్చినప్పుడు.. విషయం సెన్సిటివ్ కావడంతో పోలీసులు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ముందుగా విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాతనే యాక్షన్‌లోకి దిగారు.అసలు ఈ విషయంలో ఎప్పుడు బయటకు వచ్చిందంటే..టీసీఎస్ అనుబంధ ఃఖాలో పనిచేసే ఓ 20 ఏళ్ల హిందూ అమ్మాయి.. అక్కడ చేరిన కొన్నిరోజులకు తన మతపరమైన ఆచార వ్యవహారాలను మార్చుకుంది. ఆహార్యం, తన మతపరమైన గుర్తింపును మార్చుకునేందుకు ప్రయత్నించడంతో ఆమె తల్లిదండ్రులు ఆమె ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేశారు. ఆఫీసులోనే ఏదో జరుగుతోందని ఈ ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ చాలా పేరున్న కంపెనీ.. ఆ సంస్థలో వ్యవహారం కావడం.. విషయం చాలా సున్నితమైంది కావడంతో పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించారు. అనుమానాన్ని నిర్ధారించుకునేందుకు టీసీఎస్ లో హౌస్‌కీపింగ్ స్టాఫ్‌గా కొంతమంది కానిస్టేబుళ్లు చేరారు. ఇందులో ఒకరిద్దరు మహిళా అధికారులు కూడా ఉన్నారని కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. దాదాపు 15 రోజులు అక్కడ నిఘా ఉంచి జరుగుతున్నది నిజమే అని నిర్ధారించుకున్నారు.2026 మార్చి 25న ఒక మహిళా ఉద్యోగి డెలాలీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను 2022 నుంచి 2026 వరకూ సహచరుల చేత లైంగిక దోపిడీ, మతపరమైన వేధింపులు ఎదుర్కొన్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు, ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ముందుకు రావాలని కోరారు. దీంతో మరింత మరింత మంది బాధితులు బయటకు వచ్చారు కొద్ది రోజుల్లోనే కేసు పెద్దైంది. మొత్తం 9 ఎఫ్ ఐ ఆర్ లు నమోదయ్యాయి. 8మంది మహిళలు, ఓ పురుషుడు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులన్నీ లైంగిక వేధింపులు, అత్యాచారం, బలవంతపు సంబంధాలు, స్టాకింగ్, బెదిరింపులు, మతపరమైన ఒత్తిళ్లు, మార్పిడి ప్రయత్నాలు , మతంపై దూషణలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఒకే మతానికి చెందిన వారు కావడంతో ఇది 'కార్పోరేట్ జిహాద్'గా మారింది.ఏడుగురు అరెస్ట్ చేయగా.. అరెస్టైన వారంతా ఃఖాలో టీమ్ లీడర్లు, హెచ్ ఆర్ అధికారులు ఉన్నారు వారంతా ఒకేమతానికి చెందిన వారు. అరెస్టైన వారిలో అసిఫ్ అంసారీ, షఫీ షేక్, షారుక్ ఖురేషీ, రజా మెమన్, తౌసిఫ్ అట్టార్, డానిష్ షేక్ ఉన్నారు. వీరితో పాటు.. ఉద్యోగినులు ఫిర్యాదు ఇచ్చినా కూడా పట్టించుకోని మహిళా ఏజీఎం ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో విషయం మతపరంగా మారిపోయింది. బీజేపీ దీనిని పక్కా ప్రణాళికతో చేసిన కార్పోరేట్ స్కాండల్ అంటోంది. నిందితుల తరపు లాయర్లు మాత్రం దీనిని అనవసరంగా సన్సేషనల్ చేస్తున్నారని.. విషయాన్ని పెద్దది చేసి చూపిస్తున్నారని కామెంట్ చేస్తున్నారు. ఆఫీసుల్లో జరిగిన సంభాషణల్లో వచ్చిన అభిప్రాయ భేదాలు, విభిన్న ఆలోచనలు, భావజాలల మధ్య అంతరాలే తప్ప.. బలవంతంగా ఏం జరగలేదని లాయర్లు చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని టీసీఎస్ చాలా సీరియస్‌గా తీసుకుంది. అరెస్టైన ఉద్యోగులందరినీ సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారాన్ని తాము చాలా తీవ్రంగా తీసుకుంటున్నామని ప్రకటించింది. పని ప్రదేశంలో బలవంతాలను నిరోధించే జీరో టాలరెన్స్ కు తాము కట్టుబడి ఉన్నామని ఇలాంటి విషయాలను ఏమాత్రం ఉపేక్షించని చెప్పింది. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కూడా ఇది తీవ్రంగా విచారించదగ్గ విషయమని..దీనిపై సంస్థ ఆర్తి సుబ్రమణియన్‌తో విచారణ జరిపిస్తున్నామని ప్రకటించారు.

# వివాదాల మంగ్లీ....



హైదరాబాద్, ఏప్రిల్ 15, నిర్భయవార్త :కొంతమందికి ఫేమ్ వచ్చిన తర్వాత దానిని కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తారు. మరికొందరేమో అడ్డగోలుగా అడుగులు వేసి పరువు తీసుకుంటారు. ఈ జాబితాలో సింగర్ మంగ్లీ ముందు వరుసలో ఉన్నట్టు కనిపిస్తోంది. ఇటీవల కాలంలో ఆమె పేరు మార్మోగినట్టు మరో సెలబ్రిటీ పేరు మారుమోగలేదంటే ఆమె ఎన్ని వివాదాలలో చిక్కుకుందో అర్థం చేసుకోవచ్చు.ఆ మధ్య తన పుట్టినరోజు పార్టీ జరిగినప్పుడు మాదక ద్రవ్యాలు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఎస్ఓటి పోలీసులు దాడులు కూడా చేశారు. కొన్ని శాంపిల్స్ సేకరించారు. ఆ తర్వాత మంగ్లీ ఒక సెల్ఫీ వీడియో విడుదల చేసింది. అందులో చెప్పడం జరిగింది.. తీసుకోవడం జరిగింది అనే మాటలు తప్ప.. అధికారికంగా మంగ్లీ క్లారిటీ ఇవ్వలేదు. ఇచ్చిన స్క్రిప్ట్ పాఠం లాగా చదివింది అంతే. ఈ కేసు ఇప్పటికీ విచారణలో ఉంది.దీనికంటే ముందు బావిలోనే బల్లి పలికే అనే పాట వివాదంలో చిక్కుకుంది. ఓ భాషలో పాపులర్ అయిన పాటను మక్కికి మక్కి దించారని.. చివరికి ట్యూన్స్ కూడా అవే వాడారని ఆరోపణలు వినిపించాయి. దీనిపై మంగ్లీ స్పందించలేదు. సోషల్ మీడియాలో ఇప్పటికి ఈ పాట గురించి చర్చ జరుగుతూనే ఉంది..ఇటీవల కాలంలో బాలీవుడ్ లో ఓ సినిమా పాట పాడిన మంగ్లీ.. తీవ్రమైన వివాదంలో చిక్కుకుంది. ఆ పాటను ఆ చిత్రం నుంచి తొలగించారు. మంగ్లీ క్షమాపణలు కూడా చెప్పింది. ఇప్పటికీ ఈ పాట సంబంధించిన కేసు జాతీయ మహిళా కమిషన్ విచారణ పరిధిలో ఉంది.ఇవన్నీ జరిగిన తర్వాత మంగ్లీ కొద్దిరోజులుగా నిశ్శబ్దంగా ఉంది. ఇప్పుడు ఆమె పేరు మళ్లీ మీడియాలో వినిపిస్తోంది. పైగా మంగ్లీ, ఆమె సోదరుడు శివ దర్శకుడు వేణు ఊడుగుల మీద పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయి. మైక్రో ఫైనాన్స్ పేరుతో.. అధిక వడ్డీ.. లాభాలు ఇస్తామని మంగ్లీ, శివ, వేణు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారట. ఈ నేపథ్యంలో డబ్బులు ఇచ్చినవారు తిరిగి ఇవ్వాలని కోరితే దౌర్జన్యానికి దిగుతున్నారట. అంతేకాదు ఓ న్యాయవాదిని కారుతో గుద్ధి చంపుతామని బెదిరిస్తున్నారట. దీంతో అతడు వాళ్ళ బెదిరింపులు తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించాడు. పంజా గుట్ట పోలీసులు మంగ్లీ, ఆమె సోదరుడు, దర్శకుడు వేణు మీద కేసులు నమోదు చేశారు.ఇక అప్పట్లో శ్రీకాళహస్తి గుడిలో మంగ్లీ తన ప్రైవేట్ పాట కోసం షూట్ నిర్వహించింది. దీనిపై రకరకాలుగా విమర్శలు వినిపించాయి. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మంగ్లీ ఓ నామినేటెడ్ పదవిలో ఉంది. అప్పట్లో వైసిపి అధికారంలో ఉంది కాబట్టి శ్రీకాళహస్తిలో ఆమెకు పాట షూట్ చేసుకునే అవకాశం వచ్చిందని విమర్శలు వినిపించాయి. ఇలా చెప్పుకుంటూ పోతే మంగ్లీ మీద ఎన్నో ఆరోపణలు.. ఎన్నో విమర్శలు. సెలబ్రిటీ అయిన తర్వాత వాళ్ళు ఏమైనా మానవాతీతులా.. ఈ ప్రశ్నకు మంగ్లీ కచ్చితంగా సమాధానం చెప్పాలి


# సౌత్ పై ఎల్ నినో ప్రభావం




చెన్నై ఏప్రిల్ 15, నిర్భయవార్త :ఈ ఏడాది భారత్‌లోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల రాకపై ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ ప్రాథమిక అంచనా వేసింది. దీని కారణంగా అయితే ఈశాన్య, దక్షిణ, ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని తాజాగా విడుదల చేసిన తొలి దశ నివేదికలో పేర్కొంది.సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు సెప్టెంబర్ 3వ వారం వరకు కొనసాగుతాయి. గత రెండేళ్లుగా వర్షపాతం సమృద్ధిగా ఉన్నప్పటికీ, ఈసారి ఎల్‌నినో ప్రభావంతో మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో వర్షాలు తగ్గవచ్చని అధికారులు భావిస్తున్నారు. రుతుపవనాల చివరి దశ నాటికి ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉన్నప్పటికీ, వర్షాలు కురవడానికి కూడా సానుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటకలో వర్షపాతం మిశ్రమంగా ఉండనుంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ, మరికొన్ని చోట్ల సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. తెలంగాణలో ఉత్తర తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలకు లోటు లేదని అంచనా వేయగా.. దక్షిణ తెలంగాణలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, మధ్య కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అధిక వర్షాలు కురస్తాయని అంచనా వేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యంతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అయితే విశాఖపట్నం, అనకాపల్లి, ఉభయ గోదావరి జిల్లాలు, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, రాయలసీమలోని కడప, అన్నమయ్య జిల్లాల్లో మాత్రం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండవచ్చని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ప్రైవేట్ వాతావరణ అంచనా సంస్థ స్కైమెట్ ఇటీవల వెల్లడించింది. ముఖ్యంగా జూన్ నుండి సెప్టెంబర్ వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల కాలంలో, రెండో భాగంలో ఎల్ నినో ప్రభావం బలంగా ఉంటుందని ఆ సంస్థ పేర్కొంది. దీని వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఈ నాలుగు నెలల కాలంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 868.6 మి.మీ ఉండాలి, కానీ ఈసారి అందులో కేవలం 94 శాతం మాత్రమే వర్షాలు కురిసే అవకాశం ఉందని సంస్థ అంచనా వేసింది. భారత్‌లో ఏడాది పొడవునా నమోదయ్యే మొత్తం వర్షపాతంలో దాదాపు 70 శాతం కేవలం ఈ నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. దేశ జీడీపీకి వెన్నెముకగా నిలిచే వ్యవసాయ రంగానికి ఈ వర్షాలు అత్యంత ప్రాణాధారం. మన దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలు నేటికీ జీవనోపాధి కోసం నేరుగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నందున, వర్షపాతంలో స్వల్ప తగ్గుదల కూడా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది.రైతులకు అత్యంత కీలకమైన ఖరీఫ్ సాగు సాధారణంగా జూన్, జూలై నెలల్లోనే ప్రారంభమవుతుంది. ఈ సమయంలో నైరుతి రుతుపవనాలు సరైన సమయానికి రావడం, దేశవ్యాప్తంగా త్వరగా విస్తరించడం పంటల దిగుబడికి చాలా అవసరం. సాధారణంగా జూన్ 1న లేదా జూన్ మొదటి వారంలో కేరళను తాకే ఈ రుతుపవనాలు, జూలై 15 నాటికి ఉత్తరాది సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తాయి. అయితే, ఎల్ నినో ప్రభావం వల్ల ఈ విస్తరణలో గానీ, వర్షాల తీవ్రతలో గానీ మార్పులు వచ్చే అవకాశం ఉండటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

# రంగారెడ్డిలో భారీగా పెరగనున్న ఎంపీ స్థానాలు

హైదరాబాద్, ఏప్రిల్ 14, నిర్భయవార్త :లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 550 నుంచి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కి సవరణలు చేయనున్నారు. ఈ పునర్విభజన వల్ల తెలంగాణలో లోక్‌సభ స్థానాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా జనాభా అధికంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్త ఎంపీ స్థానాలు ఏర్పడనున్నాయి. 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలుతో.. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ నుంచి కనీసం 9 మంది మహిళలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించనున్నారు.భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతో పాటు, పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 550 ఉండగా.. 2011 జనాభా లెక్కల ప్రకారం.. ఆ సంఖ్యను 850కి పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో రాష్ట్రాల వాటా 815 కాగా.. కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 స్థానాలను కేటాయించనున్నారు.ఈ పునర్విభజన బిల్లు ప్రక్రియ వల్ల తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. కొత్త లెక్కల ప్రకారం ఇవి 26 లేదా 27కు పెరిగే అవకాశముంది. అసెంబ్లీ స్థానాలు ప్రస్తుతం 119 ఉండగా.. అదనంగా 60 సీట్లతో 179కి చేరే అవకాశం ఉంది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటే.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జనాభా పరంగా దేశంలోనే 17వ స్థానంలో ఉంది. ఫలితంగా గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనే అదనంగా 3 నుంచి 4 కొత్త లోక్‌సభ స్థానాలు ఏర్పడనున్నాయి.దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న మల్కాజిగిరితో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, భువనగిరి స్థానాలను విభజించి కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలను విభజించి అదనంగా మరో రెండు స్థానాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతమున్న మెదక్, జహీరాబాద్‌లకు తోడు మరొక కొత్త స్థానం రానుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ విభజన ద్వారా అదనంగా ఒక స్థానం ఏర్పడనుంది. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఒకటి లేదా రెండు కొత్త స్థానాలు వచ్చే సూచనలున్నాయి.ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వస్తే.. 2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది.



గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉండటం విశేషం. కాగా, ఈ పునర్విభజన ప్రక్రియ 2026-27 నాటి జనాభా లెక్కల ఆధారంగా జరిగే అవకాశం ఉందని.. అప్పటికి నియోజకవర్గాల సరిహద్దులు మారిపోయి సరికొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తాయని పొలిటికల్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు పూర్తి మద్దతు

హైదరాబాద్ :నిర్భయవార్త :మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ప్రకటించింది. అయితే డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాదికి అన్యాయం జరిగేలా ఉంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేసిందికేటీఆర్, హరీష్ రావులతో భేటీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెల్లడించారు. తొలిసారి అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో తీర్మనించామని గుర్తుచేసిన కేసీఆర్, ఆ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలపనున్నట్లు వెల్లడించారు. డీలిమిటేషన్ బిల్లులో పొందుపరిచిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాకే పార్టీ ఒక నిర్ణయానికి వస్తుందని కేసీఆర్ అన్నారు. ప్రస్తుతం లోక్సభలో దక్షిణాదికి 24% ఎంపీ సీట్లు ఉన్నాయని, అంతకంటే తగ్గకుండా 50% పెంచాలని, 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుందని కేసీఆర్ అభిప్రాయం. డీలిమిటేషన్ బిల్లు సమగ్రంగా పరిశీలించే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ఆదేశాలు ఇచ్చారు. ఇదే క్రమంలో 20న జగిత్యాల సభ, 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురించి కేసీఆర్ చర్చించినట్లు సమాచారం.

# యువ కౌలు రైతు ఆత్మహత్య

మెదక్ నిర్భయవార్త :కౌలుకు తీసుకున్న పొలం ఎండిపోవడంతో యువరైతు ఆత్మహత్య చేసుకున్నారు. మెదక్ జిల్లా ముసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి గ్రామంలో సాయిబాబా(32) అనే యువరైతు రెండెకరాల పొలం కౌలుకు తీసుకుని, వరి సాగు చేస్తున్నాడు. సాగు పెట్టుబడికి దాదాపు రూ.3 లక్షలు అప్పు చేయగా, పంట చేతికొచ్చే సమయానికి ఉన్న రెండు బోర్లు అడుగంటడంతో, కళ్ళముందే ఎండిపోతున్న పంటను చూసి మనస్తాపానికి గురైయాడు. దీంతో పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# హాస్టల్ లో విద్యార్థిని మృతి

కామారెడ్డి నిర్భయవార్త :కామారెడ్డి ఎల్లారెడ్డి బీసీ గర్ల్స్ హాస్టల్లో గుండెపోటుతో విద్యార్థిని మృతి చెందింది. కుటుంబసభ్యులు విద్యార్థిని మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలు నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన 8వ తరగతి విద్యార్థి శ్రావణి (14). ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. విద్యార్థిని మృతి పట్ల సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

# రైతులను ముంచేస్తున్న నకిలీ విత్తనాలు



హైదరాబాద్, ఏప్రిల్ 15, నిర్భయవార్త ప్రతినిధి :రైతన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అక్ర మ విత్తన వ్యాపారులు మళ్లీ పడగ విప్పుతున్నారు. ప్రభుత్వం కఠినంగా నిషేధించిన హెచ్‌టీబీటీ లేదా 'గ్లైసిల్' పత్తి విత్తనాలు మార్కెట్‌లో గుట్టుచప్పుడు కాకుండా అమ్ముడవుతున్నాయి. గత ఏడాదితో పోలి స్తే ఈ సీజన్‌లో వీటి వాడకం దాదాపు 25 నుంచి 30 శాతం వరకు పెరిగినట్టు వ్యవసాయరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.నిషేధిత విత్తనాలు ప్రధానంగా పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల మీదుగా భారీ గా గ్లైసిల్ విత్తనాలు రాష్ట్రంలోకి వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా, ఎన్టీఆర్, గుంటూ రు జిల్లాల పరిసర ప్రాంతాల నుంచి ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు ఈ విత్తనాల రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు ప్రాంతం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోకి కూడా అక్రమంగా విత్తనాలు చేరుతున్నాయి. అధికారుల దాడుల్లో కొంతమేర విత్తనా లు పట్టుబడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో విక్రయాలు మాత్రం ఆగడం లేదని సమాచారం.గ్లైసిల్ పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించింది. అయితే ఏంటట.. అంటూ వ్యాపారులు హెచ్‌టీబీటీ అని పిలిచే ఈ పత్తి విత్తనాలను మార్కెట్‌లో గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నారు. అంతేకాదు ఈ సీజన్‌లో ఈ విత్తనాల వాడకం 30 శాతం వరకు పెరిగింది! మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల నుంచి రాష్ట్రంలోకి భారీగా గ్లైసిల్ పత్తి విత్తనాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి.గ్లైసిల్ విత్తనాలకు వాడే గ్లైఫోసేట్ రసాయనం కార ణంగా నేలలో ఉండే 'నైట్రోజన్ ఫిక్సింగ్' బ్యాక్టీరియా సుమారు 40 శాతం వరకు తగ్గిపోతున్నట్లు నిపుణులు చెబుతున్నా రు. దీనితో భూమి నిస్సారంగా మారుతున్నది. భవిష్యత్తులో పంటలు పండక భూములన్నీ ఎడారిగా మారే ప్రమాదం ఉ ందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక, మహారాష్ట్రలో గడ్డి మందుపై నిషేధం లేకపోవడంతో అక్కడి నుంచి కొంతమంది తెచ్చి ఇక్కడి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ప్రారంభంలో కలుపు నివారణ ఖర్చు త గ్గుతుందని రైతులు భావించినప్పటికీ, మూ డేండ్ల తర్వాత భూమి నిస్సారంగా మారడంతో ఖర్చు ఎకరాకు రూ. 10,000 నుంచి రూ.15,000 వరకు పెరుగుతున్నది.గ్లైఫోసేట్ వంటి ఘాటైన రసాయనాల వల్ల నేలలోని మేలు చేసే సూక్ష్మజీవులు నశించి భూమి నిస్సారంగా మారుతుంది. భవిష్యత్తులో పంటలు పండని ఎడారిగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పంటలపై స్ప్రే చేసే కలుపు సంహారక మందుల వల్ల గాలి కాలుష్యం పెరిగి, వాటిని పీల్చే రైతులు, కార్మికుల ఊపిరితిత్తులు దెబ్బతింటాయని చెబుతున్నారు. చర్మ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం పొంచి ఉన్నద ని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అనుమతి లేని విత్తనాలను అమ్మడం, వాడటం చట్టప్రకారం నేరం. పట్టుబడితే జరిమానాలతోపాటు జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందిఇప్పటికైనా మన నేలను కాపాడుకోవడం ప్రభుత్వంతోపాటు మనందరి బాధ్య త. భూదేవిని రక్షించాలంటే అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్లైసిల్ విత్తనాల మూలాలను అణచివేయాలి. అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి. రైతులు కూడా తక్షణ లాభాల కంటే నేల ఆరోగ్యాన్ని ముఖ్యంగా భావించాలి. వ్యవసాయశాఖ సమన్వయంతో సరిహద్దుల వద్ద నిఘా పెంచి, గ్రామాల్లో గ్లైసిల్ వాడకం వల్ల కలిగే నష్టాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.గ్లైసిల్ విత్తనాలకు వాడే గ్లైఫోసేట్ రసాయనం కారణంగా నేలలో ఉండే 'నైట్రోజన్ ఫిక్సింగ్' బ్యాక్టీరియా సుమారు 40 శాతం వరకు తగ్గిపోతున్నట్టు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రజారోగ్యానికి ముప్పు

ఈ విత్తనాలకు వాడే రసాయనాలు, పంటపై పిచికారీ చేసే మందుల వల్ల వ్యవసాయ కార్మికుల్లో శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులు 20 శాతంపైగా ఎక్కువగా నమోదవుతు న్నాయని ప్రాథమిక అధ్యయనాలు చెబుతున్నాయి.నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కేసులేగ్లైసిల్ పత్తి విత్తనాలు, గ్లైఫోసేట్ వంటి నిషేధిత గడ్డి మందులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుంది. అవి మనుషుల ఆరో గ్యానికి కూడా ప్రమాదకరం. రైతు లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే నాణ్య మైన పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలి. నిషేధిత విత్తనాలు వాడితే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. మేము తనిఖీలు నిర్వ హిస్తున్నాం అని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, అవి చిన్నపాటి వ్యాపారులకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దందా వెనుక ఉన్న అసలైన పెద్దలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో గ్లైసిల్ పత్తి సాగవుతున్నట్టు అంచనా ఉన్నా, చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయని రైతులు అంటున్నారు.నాణ్యమైన విత్తనాలు వేసుకున్న రైతులు సకాలంలో పత్తి పంటను కోయగా, గ్లైసిల్ విత్తనాలు వాడిన రైతుల పంట మాత్రమే ఆలస్యంగా చేతికి వచ్చిందని చెబుతున్నారు. దీంతోపాటు మహారాష్ట్రలో గడ్డి మందుపై నిషేధం లేకపోవడంతో అక్కడి నుంచి తెచ్చి ఇక్కడి రైతులకు అధిక ధరలకు అమ్ముతున్నట్టు తెలిసింది.

## కాటేస్తున్న వాయు కాలుష్యం

మహబూబ్ నగర్, ఏప్రిల్ 15, నిర్భయవార్త ప్రతినిధి : రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామ సమీపంలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ మళ్లీ జవసత్వాలు పుంజుకుంది. అయితే, ఆ పరిశ్రమ పునఃప్రారంభం స్థానిక ప్రజల పాలిట శాపంగా మారింది. కాలుష్య కోరల్లో చిక్కుకున్న గ్రామస్తులు, తండాల ప్రజలు తమ ప్రాణాలను కాపాడాలంటూ గగ్గోలు పెడుతున్నారు.గతంలో రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించే ఈ కంపెనీ, ఇప్పుడు బరితెగించి పగలు, రాత్రి తేడా లేకుండా కార్యకలాపాలు సాగిస్తోంది.చిమ్మే నల్లటి పొగ ఆకాశాన్ని కమ్మేస్తుంటే, రసాయన వ్యర్థాలు భూగర్భ జలాలను విషతుల్యం చేస్తున్నాయి.రసాయన వ్యర్థ జలాలు భూమిలోకి ఇంకిపోవడంతో తాగే నీరు కలుషితమవుతోంది. పొలాల్లో బూడిద పేరుకుపోవడంతో పంటలు పండక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కలుషితమైన గడ్డిని మేసి, విషపూరిత నీటిని తాగి పశువులు అకాల మరణం పాలవుతున్నాయి.ఇంత జరుగుతున్నా అధికారులు మౌనం వహించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తు న్నారు. నిబంధనలను తుంగలో తొక్కి కంపె నీ నడుపుతున్నా పట్టించుకోకపోవడం వెను క స్థానిక ప్రజాప్రతినిధుల హస్తం ఉందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం కంటే తమ స్వార్థమే ముఖ్యమనుకుంటున్న నాయకుల తీరుపై ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు.మా పిల్లలు ఊపిరి పీల్చుకోవడానికి భయపడుతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఈ కంపెనీ వెనుక ఉన్న పెద్ద తలకాయలు ఎవరో తేలాలని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.పర్యావరణ శాఖ నిబంధనలు ఇప్పలపల్లి ఐరన్ కంపెనీకి వర్తించవా? కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కళ్లు మూసుకుందా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.కంపెనీ యాజమాన్యం తీరు మారుతుందా? లేక అధికారులు ఇప్పటికైనా నిద్ర మేల్కొంటారా? అసలు ఈ కంపెనీ ఆగడాల వెనుక ఉన్న ఆ రాజకీయ నేతలు ఎవరు?



## అన్న తమ్ముళ్లు కేబినెట్ లో ఉంటే తప్పేంటీ...?

### జగ్గారెడ్డి కొత్త లాజిక్..

మెదక్, ఏప్రిల్ 15, నిర్భయవార్త ప్రతినిధి :మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం డబ్బులు లేకుంటే రాజకీయం లేదని పేర్కొన్నారు. అదే సమయంలో కేబినెట్ విస్తరణకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఇక తనకు పీసీసీ పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా జగ్గారెడ్డి స్పందించారు.రాష్ట్ర రాజకీయాలు, మంత్రి పదవులు, ఎన్నికల్లో ధన ప్రవాహం సహా అనేక అంశాలపై గాంధీ భవన్ వేదికగా మీడియాతో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మంత్రి పదవులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన జగ్గారెడ్డి.. కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరికీ కేబినెట్‌లో చోటు ఉండాలన్నారు. మంత్రి పదవి కావాలంటూ గత కొన్ని రోజులుగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పట్టుబడుతున్న వేళ.. జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ప్రస్తుతం తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రివర్గంలో కొనసాగిస్తూనే.. ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కూడా మంత్రి పదవి ఇవ్వాలని జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ కేబినెట్‌లో ఉంటే తప్పేంటని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తాను ఇదే చెప్తానని స్పష్టం చేశారు. ప్రస్తుత సమయంలో డబ్బులు లేకుండా రాజకీయం లేదని జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు డబ్బు పెడితే వాళ్లే నాయకులు అవుతున్నారని చెప్పారు. ఒక ఎమ్మెల్యేగా గెలవాలి అంటే రూ.100 కోట్లు ఖర్చు అవుతున్నాయని పేర్కొన్నారు.ఇక తనను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిగా నియమించాలని ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా జగ్గారెడ్డి స్పందించారు. ఆయన మాట్లాడుతూ ఫ్లోలో పీసీసీ చీఫ్ జగ్గారెడ్డి అని అన్నారనని.. అది కూడా ఏ 3 ఏళ్లకో 4 ఏళ్లకో అన్నట్లు చెప్పారని వెల్లడించారు. ఇప్పుడు అది చర్చ కాదని కొట్టిపారేశారు. ఇక పీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ కొనసాగవచ్చని తెలిపారు. గ్రామాల్లో రెడ్డిలు, బీసీలు కలిసి ఉంటామని.. కలిసి పని చేస్తామని జగ్గారెడ్డి క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో పీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ పేరును తానే ప్రతిపాదించానని.. రెడ్లు అంతా సపోర్ట్ చేస్తేనే ఆయన పీసీసీ చీఫ్ అయ్యారని జగ్గారెడ్డి తెలిపారు.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో తాము అంతా కలిసే ఉన్నామని.. తమ బంధాన్ని చెడగొట్టొద్దని జగ్గారెడ్డి హితవు పలికారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి ఓసీ అని.. ఆ పార్టీ అధ్యక్షుడు ఓసీ అని పేర్కొన్న జగ్గారెడ్డి.. అప్పుడు ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. 10 ఏళ్లు ఎవరైనా దళితుడిని సీఎం ఎందుకు చేయలేదని అడిగారా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్‌కు మీడియా భయపడిందని జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.



## జనసేనలోకి తోట చంద్రశేఖర్

హైదరాబాద్, ఏప్రిల్ 15, నిర్భయవార్త ప్రతినిధి :రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. దీంతో తోట చంద్రశేఖర్ మళ్లీ జనసేన పార్టీలో చేరబోతున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. తోట చంద్రశేఖర్ 2019 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ తరఫున పోటీచేసి ఓటమిపాలయ్యారు. అనంతరం చంద్రశేఖర్ బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే.ఏపీ రాజకీయాల్లో మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ ఎపిసోడ్ తెరపైకి వచ్చింది. అనూహ్యంగా చంద్రశేఖర్ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాశంగా మారింది. తోట చంద్రశేఖర్ మంగళగిరిలోని జనసేన పార్టీ ఆఫీసులో పవన్ కళ్యాణ్‌తో సమావేశం అయ్యారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆయన.. ఉన్నట్టుండి పవన్ కళ్యాణ్‌ను కలడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.. తోట మళ్లీ జనసేన పార్టీలో చేరబోతున్నారనే ప్రచారం మొదలైంది.తోట చంద్రశేఖర్ మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2008లో ఆయన ఉ ద్యోగానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆదిత్య హైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగారు. అనంతరం రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు.. 2009 ఎన్నికల సమయంలో ప్రజారాజ్యం పార్టీ స్థాపనలో కీలకపాత్ర పోషించారు. జనసేన పార్టీలో కూడా కీలకంగా వ్యవహరించారు. చంద్రశేఖర్ మెగా బ్రదర్స్‌కు అత్యంత సన్నిహితుడిగా కొనసాగారు. కానీ ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరిన చంద్రశేఖర్ 2014 ఎన్నికల్లో ఏలూరు ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు.చంద్రశేఖర్ మళ్లీ జనసేన పార్టీలో చేరగా.. పవన్ కళ్యాణ్ ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించారు. 2019 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసిన తోట ఓడిపోయారు. తోట చంద్రశేఖర్ మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీలో చేరగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ బాధ్యతలు అప్పగించారు. తద్వారా ఏపీలో కీలకంగా మారిన కాపులను తమవైపు తిప్పుకోవచ్చని కేసీఆర్ భావించారు. కానీ 2023 చివర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. ఆ తర్వాత నుంచి చంద్రశేఖర్ రాజకీయాలకు దూరంగా ఉ ంటున్నారు. ఇప్పుడు మళ్లీ ఆయన పవన్ కళ్యాణ్‌ను కలవడతంతో జనసేన పార్టీలోకి వస్తారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి.అయితే తోట చంద్రశేఖర్ పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారా.. రాజకీయ కారణాలు ఉన్నాయా అనేది క్లారిటీ లేదు. చాలాకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న చంద్రశేఖర్ పవన్ కళ్యాణ్‌ను వెళ్లి జనసేన పార్టీ కార్యాలయంలో కలవడంతో, ఆయన జనసేన పార్టీలోకి రీ ఎంట్రీ ఇస్తారనే చర్చ మొదలైంది. ఈ రాజకీయ ఊహాగానాలపై తోట చంద్రశేఖర్ స్పందించాల్సి ఉంది.

చంద్రశేఖర్ పవన్ కళ్యాణ్‌ను కలవడం పట్ల జనసేన సానుభూతి పరులు స్పందిస్తున్నారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రశేఖర్ పార్టీని వీడకుండా ఉండుంటే.. గుంటూరు జిల్లాలో ముఖ్య నాయకుడిగా, లోక్ సభ ఎంపీగా అయ్యుండేవారని చెబుతున్నారు. ఆయన తిరిగి పార్టీలోకి వస్తే మంచిదేనని, ఒకవేళ ఇది మర్యాదపూర్వక కలయిక అయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంటున్నారు. తోట చంద్రశేఖర్‌కు చెందిన టీవీ ఛానెల్ వైసీపీకి అనుకూలంగా మారుతుందనే భావన కలుగుతోందని.. ఇలాంటి టైంలో ఆయన పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారా లేదా వ్యూహాత్మకంగా కలిశారా అనేది తెలియాల్సి ఉ ందని జనసేన లీగల్ వ్యవహారాలు చూసే శాంతి ప్రసాద్ సింగలూరి కామెంట్ చేశారు.

## కాసులు కురిపిస్తున్న ఓపెన్ బార్లు



హైదరాబాద్, ఏప్రిల్ 15, నిర్భయవార్త ప్రతినిధి : మామూళ్ళ మత్తులో అధికారులు తూగుతుండగా మద్యం దుకాణ వ్యాపారులు ఇష్టారీతిగా దందా కొనసాగిస్తూ భారీ స్థాయిలో వినియోగదారుల జేబుకు చిల్లు పెడుతున్నారు. నిబంధనలను పక్కనబెట్టి వైన్స్ మాఫియా పెట్రేగిపోతుంది. రామచంద్రపురం మండల పరిధిలో వైన్స్ షాపుల చుట్టూ జరుగుతున్న అక్రమాలు రోజురోజుకూ బహిరంగ రూపం దాల్చుతున్నాయి.పార్కింగ్ పేరుతో చూపిస్తున్న ప్రదేశాలు పూర్తిస్థాయి ఓపెన్ బార్లుగా మారిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల్లో కూర్చొని మద్యం సేవించడం, కార్ల దగ్గరకే మద్యం సరఫరా చేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్లను ఆసరాగా చేసుకుని ఓపెన్ ప్లేస్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మ్యాచ్ల వీక్షణ పేరుతో టేబుళ్లను, కుర్చీలు ఏర్పాటు చేసి బహిరంగంగా మద్యం సేవనానికి అవకాశం కల్పిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో పెద్ద ఎత్తున గుంపులుగా చేరి హంగామా చేస్తున్నట్లు చెబుతున్నారు.కొన్ని వైన్స్ షాపులు పర్మిట్ గదుల పరిమితులను పట్టించుకోకుండా పెద్ద హాళ్లు ఏర్పాటు చేసి భారీ సంఖ్యలో మద్యం ప్రియులను కూర్చోబెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. భారీ స్థాయిలో షెడ్లను ఏర్పాటు చేసి మినీ బార్లుగా తీర్చిదిద్ది మద్యం ప్రియుల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉ న్నాయి.అంతేగాకుండా పార్కింగ్ స్థలాల్లో కార్లలోనే మద్యం సేవించడం, షాప్ సిబ్బంది కార్ల దగ్గరకే వెళ్లి మద్యం అందించడం బహిరంగంగా కొనసాగుతుంది. ఇది చట్టాలను బహిరంగంగా ఉ ల్లంఘించడమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం యజమానులు ధనార్జనే ధ్యేయంగా ఇష్టారీతిగా అమ్మకాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం వ్యాపారులు బహిరంగంగా అక్రమాలకు పాల్పడుతున్నాఅబ్కారీ శాఖ షరా మామూళ్ళే అన్నట్లుగా వ్యవహరిస్తోంది. నెలవారీగా సంబంధిత అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్ళు అందుతున్నాయని, అందుకే మద్యం దుకాణాల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా విజిలెన్స్ అధికారులతో పాటు ఎక్సైజ్, పోలీసు అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ఎండుగడ్డితో.. బయోగ్యాస్!

## ఇక గడ్డి కూడా బంగారమే

- ₹700 కోట్లతో బయో గ్యాస్ ప్రాజెక్టు
- నర్మెట్ట పారిశ్రామికవాడలో 10 ప్లాంట్లు నిర్మాణం
- పొలాల నుంచి గడ్డి సేకరణకు ప్లాన్
- కోళ్ల వ్యర్థాలు, పశువుల పేడ కూడా వినియోగం
- ఉత్పత్తి అయిన గ్యాస్ గ్రిడ్‌కు అనుసంధానం
- గెయిల్, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌తో ఒప్పందం

హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి :

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. నిన్నటి వరకు అనవసర వ్యర్థంగా, కాలుష్య కారకంగా భావించిన వరిగడ్డి, ఇప్పుడు రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతోంది. తెలంగాణ ప్రభుత్వం, జానో జూల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా చేపట్టిన భారీ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుతో తెలంగాణ ఇంధన రంగంలో సరికొత్త చరిత్రను లిఖించబోతోంది. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం నర్మెట్ట పారిశ్రామిక ప్రాంతంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు, వరిగడ్డిని 'బంగారం'గా మార్చబోతోంది. రాష్ట్ర పారిశ్రామిక, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో భూమిపూజ జరుపుకున్న ఈ ప్రాజెక్టు ₹700 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటోంది. మొత్తం 10 ప్లాంట్లను ఒకే క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో భాగంగా ₹210 కోట్లతో మూడు ప్లాంట్లను నిర్మిస్తున్నారు. ఈ ప్లాంట్లు రోజుకు 30 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభం కానున్నాయి. 202930 నాటికి పది ప్లాంట్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే, రోజువారీ ఉత్పత్తి 100టన్నులకు చేరుకుంటుంది.





### రైతులకు అదనపు ఆదాయం..

వరి కోతల తర్వాత పొలాల్లో మిగిలిపోయే వరిగడ్డిని తగులబెట్టడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోంది. అయితే.. ఇకపై రైతులు గడ్డిని తగలబెట్టాల్సిన అవసరం లేదు. జానో జూల్ సంస్థ నేరుగా రైతులతో ఒప్పందాలు చేసుకుని, వారి పొలాల నుంచే గడ్డిని సేకరిస్తుంది. దీనివల్ల రైతులకు పంట ఆదాయంతో పాటు గడ్డి అమ్మకం ద్వారా అదనపు నగదు లభిస్తుంది. వరిగడ్డితో పాటు కోళ్ల వ్యర్థాలు, పశువుల పేడ వంటి సేంద్రియ పదార్థాలను కూడా ఈ ప్లాంట్లలో ఇంధనంగా మారుస్తారు.

### ఆత్మనిర్భర్ భారత్ దిశగా అడుగులు..

ప్రస్తుతం భారతదేశం తన ఇంధన అవసరాల కోసం 65శాతానికి పైగా ఇతర దేశాల నుంచి దిగుమతులపై ఆధారపడుతోంది. ఈ బయోగ్యాస్ ప్రాజెక్టుల ద్వారా స్వదేశీ ఇంధన ఉత్పత్తి పెరిగి, విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఉత్పత్తి అయిన గ్యాస్‌ను నేరుగా సిటీ గ్యాస్ గ్రిడ్‌లోకి సరఫరా చేసేందుకు ఇప్పటికే గెయిల్, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయి. ఇది కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'గోబర్ ధన్, సతత పథకాలకు వెన్నుముకగా నిలుస్తుంది.

### పర్యావరణ హితం.. ఉపాధి కల్పన..

ఈ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. గడ్డి తగులబెట్టడం వల్ల కలిగే వాయు కాలుష్యాన్ని నిరోధించడమే కాకుండా, వ్యర్థాల నుంచి గ్యాస్ తీయగా మిగిలిన 'డైజెస్ట్'ను నాణ్యమైన సేంద్రియ ఎరువుగా రైతులకు తిరిగి అందించవచ్చు. తద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గి భూసారం పెరుగుతుంది. మరోవైపు, ఈ క్లస్టర్ ప్రాజెక్టు ద్వారా సుమారు 1,400 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. ముఖ్యంగా మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ, మొత్తం ఉద్యోగాల్లో 30% మహిళలకే కేటాయించడం విశేషం. "వ్యర్థాల నుంచి ఆదాయం" అనే నినాదంతో సాగుతున్న ఈ ప్రయాణం తెలంగాణ రైతులకు వరప్రసాదమే. సామాన్య రైతును ఇంధన ఉత్పత్తిదారుగా మార్చడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రాజెక్టు, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలవనుంది. వరిగడ్డి ఇక వ్యర్థం కాదు.. అది రైతు ముంగిట బంగారంగా మారబోతోంది.

# నర్సన్నసేవలో అక్షరధామ్ స్వామీజీలు

- యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణ శైలికి ప్రశంసలు



యాదాద్రి, నిర్భయవార్త : ఆధ్యాత్మికతకు నిలయమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్రాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ (బీఏపీఎస్) స్వామినారాయణ సంస్థకు చెందిన ప్రముఖ సాధువులు బుధవారం సందర్శించారు. ముంబై అక్షరధామ్ నుంచి విచ్చేసిన భారత దేశ పిల్లల విభాగం ముఖ్య బాధ్యులు పూజ్య అక్షర్ కీర్తన్ స్వామీజీ, ముంబై కేంద్రానికి చెందిన పూజ్య అక్షర్ వల్లభ స్వామీజీలతో పాటు సికింద్రాబాద్ బీఏపీఎస్ మందిర కిచెన్ విభాగం అధిపతి పూజ్య హరినిష్ఠ స్వామీజీలు క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ అధికారుల ఆహ్వానం మేరకు గర్భాలయంలోని నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామీజీలకు ఆలయ సాంప్రదాయాలతో స్వాగతం పలికి స్వామి వారి దివ్య ప్రసాదాన్ని, శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం అద్భుతమైన శిల్పకళతో పునర్నిర్మితమైన యాదగిరిగుట్ట ఆలయ ప్రాశస్త్యాన్ని, కృష్ణశిలల ప్రాముఖ్యతను స్వామీజీలు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ తిరుపతిగా వెలుగొందుతున్న ఈ క్షేత్రంలోని ఆధ్యాత్మిక వాతావరణం పట్ల వారు ఎంతో ప్రసన్నతను వ్యక్తం చేశారు. భగవంతుని కృప అందరిపై ఉండాలని, లోకకళ్యాణం జరగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ పర్యటనలో స్థానిక బీఏపీఎస్ వలంటీర్లు, భక్తులు పాల్గొని స్వామీజీల ఆశీస్సులు తీసుకున్నారు.

# హన్మాపురంలో దారుణం


- భార్య భర్తల పంచాయితీ
- కూతురు గొంతు నులిమి చంపిన తండ్రి



యాదాద్రి, నిర్భయవార్త : భార్య, భర్తల పంచాయితీ రెండు సంవత్సరాల చిన్నారిని బలి చేసింది.. తండ్రే కూతురును గొంతు నులిమి చంపిన దారుణ ఘటన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హన్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. భార్యాభర్తల మధ్య గత కాలంలో గొడవలు జరుగుతుండగా మొన్న ఉగాది తల్లిగారింటి నుంచి వచ్చింది భార్య. ఈ నేపథ్యంలో నేటి ఉదయం అక్కడికి చేరుకున్న భర్త శ్రీ రాములు అక్కడే అడుకుంటున్న కుమార్తెను గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శ్రీరాములు లొంగిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సిరిసిల్ల జిల్లాలో.. చిరుత కలకలం

### పొతిరెడ్డిపల్లెలో దూడపై దాడి



సిరిసిల్ల, నిర్భయవార్త : :రాజన్న సిరిసిల్ల జిల్లా పోతిరెడ్డిపల్లె గ్రామంలో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామాని చెందిన సద్దుల పూర్ణ ఇంటి వద్ద కట్టేసిన లేగ దూడను చంపి తినేయడం స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. ఉదయం లేచి చూసిన కుటుంబసభ్యులు దూడ మృతదేహం కనిపించడంతో షాకయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావర ణం నెలకొంది. గ్రామ పరిసరాల్లో చిరుత తిరుగుతుండటంతో గ్రామస్తులు తీవ్ర భా యందోళనలకు గురవుతున్నారు. చిరుతను పట్టుకోవాలని అటవీ సిబ్బందిని కోరుతున్నారు.

# దంచికొడుతున్న.. ఎండలు

## నిప్పుల కొలిమిలా తెలంగాణ

- ఏకంగా 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- వచ్చే మూడో రోజులు మరింత పెరిగే అవకాశం
- పగటి పూట బయటకు రావద్దంటున్న డాక్టర్లు

హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి :

తెలంగాణ రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఏప్రిల్ నెల మధ్యలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం విలవిలలాడుతున్నారు. ఆకాశం నుంచి నిప్పులు కురుస్తున్నాయా అన్నట్లుగా ఎండల తీవ్రత పెరుగుతోంది. మంగళవారం నాటి వాతావరణ నివేదికల ప్రకారం, రాష్ట్రంలోని దాదాపు 29జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదు కావడం గమనార్హం. ఉదయం 8 గంటల నుంచే ఎండ వేడి మొదలవుతుండగా, మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

### అడవి దేవులపల్లిలో అత్యధికం..

రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4డిగ్రీలు, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో 43.2 డిగ్రీల మేర ఎండ తీవ్రత ఉంది. రాజధాని హైదరాబాద్‌లో సైతం సాధారణం కంటే 2.8 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రత పెరిగి, ప్రజలను ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

### సాధారణం కంటే పెరిగిన ఉష్ణోగ్రతలు

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండలు చాలా ముందుగానే ముదిరాయి. దాదాపు అన్ని జిల్లాల్లోనూ సాధారణం కంటే 1.5 నుంచి 3.8 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో సాధారణం కంటే 3.8 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 3.2 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగడం ఆయా ప్రాంతాల్లో ఎండల తీవ్రతను తెలియజేస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ కనీస ఉష్ణోగ్రత 40.9 డిగ్రీల కంటే తక్కువ ఎక్కడా నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

### వడగాడ్పుల హెచ్చరిక..

ఈ మూడు రోజులు (బుధ, గురు, శుక్రవారాల్లో) రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. గరిష్ట ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే



అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.





# రామాయణ' ప్రొడ్యూసర్ చేతుల్లోకి 'బ్రహ్మాస్త్ర 2'



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో 'రామాయణ' చిత్రాన్ని నిర్మిస్తున్న నమిత్ మల్హోత్రా ఇప్పుడు మరో సంచలనానికి తెరలేపారుభారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో 'రామాయణ' చిత్రాన్ని నిర్మిస్తున్న నమిత్ మల్హోత్రా ఇప్పుడు మరో సంచలనానికి తెరలేపారు. గతంలో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన 'బ్రహ్మాస్త్ర' పార్ట్ 1 తర్వాత, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ బాధ్యతలను ఆయన చేపట్టారు. సినిమా కాన్ 2026 వేదికగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించడంతో అటు 'రామాయణ'పై, ఇటు 'బ్రహ్మాస్త్ర 2'పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఆ వివరాలు చూద్దాం.. రామాయణ జోరు.. బ్రహ్మాస్త్ర హోరు: ప్రస్తుతం నమిత్ మల్హోత్రా దేశంలోనే అత్యంత ఖరీదైన చిత్రంగా భావిస్తున్న 'రామాయణ' పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ పౌరాణిక గాథను రెండు భాగాలుగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇక ఈ సినిమా ప్రమోషన్స్ కోసం 'సినిమా కాన్ 2026'కు వెళ్లిన నమిత్, అక్కడే 'బ్రహ్మాస్త్ర 2' గురించి కూడా కీలక ప్రకటన చేశారు. ఇక దీంతో ఆయన ఇప్పుడు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో మోస్ట్ పవర్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా మారిపోయారు కరణ్ జోహార్ నుంచి నమిత్ చేతుల్లోకి: 2022లో విడుదలైన 'బ్రహ్మాస్త్ర: పార్ట్ 1 – శివ' మంచి విజయాన్నే అందుకుంది. అయితే, అప్పట్లో ఆ చిత్రానికి అయిన భారీ ఖర్చు వల్ల నిర్మాత కరణ్ జోహార్‌కు అది ఆశించిన స్థాయిలో లాభాలను తీసుకురాలేకపోయింది. మొదటి భాగానికి కరణ్ జోహార్, నమిత్ మల్హోత్రా, అయాన్ ముఖర్జీ కలిసి నిర్మాతలుగా వ్యవహరించారు. ఇక కానీ ఇప్పుడు పార్ట్ 2 విషయానికి వచ్చేసరికి, ఈ ప్రాజెక్ట్ పూర్తిగా నమిత్ మల్హోత్రా చేతుల్లోకి వెళ్లింది. ఆయన ఈ సీక్వెల్‌ను మరింత గ్రాండ్‌గా నిర్మించాలని ప్లాన్ చేస్తున్నారు.మళ్లీ అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లోనే: 'బ్రహ్మాస్త్ర' మొదటి భాగం కోసం దర్శకుడు అయాన్ ముఖర్జీ సుమారు నాలుగు సంవత్సరాలు కష్టపడ్డారు. ఆయన విజన్ మరియు గ్రాఫిక్స్ పనితీరుపై అప్పట్లో ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు రెండో భాగాన్ని కూడా ఆయనే తెరకెక్కించబోతున్నారు. నమిత్ మల్హోత్రా బ్యాకింగ్ ఉండటంతో, అయాన్ ముఖర్జీకి టెక్నికల్‌గా మరియు బడ్జెట్ పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ సినిమాను రూపొందించే అవకాశం దక్కింది. ఇక త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించనుంది. ఒకవైపు 'రామాయణ' లాంటి పురాణ కావ్యం, మరోవైపు 'బ్రహ్మాస్త్ర' లాంటి ఫాంటసీ అడ్వెంచర్.. ఈ రెండూ నమిత్ మల్హోత్రా చేతుల్లో ఉండటంతో బాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురవడం ఖాయంగా కనిపిస్తోంది. భారీతనం మరియు విజువల్ వండర్స్ ఇష్టపడే ప్రేక్షకులకు రాబోయే రెండేళ్లూ పండగే అని చెప్పాలి. ఇక మరి 'బ్రహ్మాస్త్ర 2'లో శివ ప్రయాణం ఎటువైపు సాగుతుందో, కొత్తగా ఏ అస్త్రాలు పరిచయం అవుతాయో చూడాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే!

# రజినీ సినిమా.. మళ్లీ ట్విస్ట్



సూపర్ స్టార్ రజినీకాంత్ కొత్త సినిమాకు సంబంధించి గత కొన్ని నెలలుగా ఎంత చర్చ జరుగుతోందో తెలిసిందే.:

సూపర్ స్టార్ రజినీకాంత్ కొత్త సినిమాకు సంబంధించి గత కొన్ని నెలలుగా ఎంత చర్చ జరుగుతోందో తెలిసిందే. తన మిత్రుడే అయిన మరో లెజెండరీ హీరో కమల్ హాసన్ నిర్మాణంలో రజినీ ఓ సినిమా చేయడానికి ఏడాది ముందు ఓకే చెప్పాడు. వీరి కలయికలో వచ్చే సినిమాకు దర్శకుడిగా ముందు సుందర్‌ను ప్రకటించారు. కానీ ఈ ప్రకటన వచ్చిన కొన్ని రోజులకే ఆయనీ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. తర్వాత కొన్ని నెలలకు 'డాన్' దర్శకుడు శిబి చక్రవర్తి తెరపైకి వచ్చాడు. ఇలాంటి యంగ్ డైరెక్టర్‌తో రజినీ సినిమా చేస్తున్నందుకు అభిమానులు కూడా చాలా సంతోషించారు ఈ చిత్రంలో రజినీ లుక్‌కు సంబంధించి శిబి 80కి పైగా డిజైన్లు రెడీ చేయించాడని.. అందులోంచి ఒకటి రజినీ ఫైనలైజ్ చేయబోతున్నాడని కొన్ని రోజుల ముందు వార్తలు వచ్చాయి.

ఇది అభిమానుల్లో ఉత్సాహం నింపింది. కానీ ఇప్పుడు ఉన్నట్లుండి ఒక షాకింగ్ వార్త బయటికి వచ్చింది. శిబి ఈ సినిమా నుంచి తప్పుకున్నాడని.. 'డ్రాగన్' దర్శకుడు అశ్వత్ మారిముత్తును దర్శకుడిగా ఎంపిక చేసుకున్నారని ఒక ప్రచారం మొదలైంది. రజినీ సినిమాకు వరుసగా ఈ మార్పులు ఏంటి అని ఫ్యాన్స్ తలలు పట్టుకున్నారు.

కానీ రెండు రోజులుగా జరుగుతున్న ఈ ప్రచారం ఇప్పుడు ఇంకో మలుపు తీసుకుంది. ఈ చిత్రానికి దర్శకుడి మార్పు నిజం కాదని అంటున్నాయి కోలీవుడ్ మీడియా వర్గాలు. అశ్వత్ మారిముత్తు.. ముందు అనుకున్న ప్రకారమే శింబు హీరోగా ఒక సినిమా తీయబోతున్నాడట. ఆ సినిమాకు సంబంధించి నిర్మాణ సంస్థ ఒక అప్‌డేట్ కూడా ఇచ్చింది. శింబు, అశ్వత్ కలయికలో వచ్చే సినిమాకు సాయి అభ్యంకర్‌ను సంగీత దర్శకుడిగా ప్రకటించింది.


రజినీ సినిమా కోసం శిబి తయారు చేసిన కథ విషయంలో సంతృప్తిగా లేరన్నది నిజం కాదని అంటున్నారు. ఉన్న ఇబ్బందల్లా తెలుగు నిర్మాత శ్రీనివాస చిట్టూరితో ఒక కమిట్మెంట్‌కు సంబంధించిన వివాదమేనట. తన కమిట్మెంట్ నెరవేర్చనందుకు రూ.5 కోట్లు చెల్లించాలని నిర్మాత కోరుతుంటే..

# బుచ్చిబాబు 'పెద్ది'.. అవుట్ పుట్ తో అందరికీ షాక్ ఇవ్వనున్నారా?



మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు బుచ్చిబాబు సనా.. ఇప్పుడు తన రెండో ప్రాజెక్ట్ తో మరింత హైప్ క్రియేట్ చేస్తున్నారు. మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు బుచ్చిబాబు సనా.. ఇప్పుడు తన రెండో ప్రాజెక్ట్ తో మరింత హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఉప్పెన తర్వాత ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం పెద్ది, టాలీవుడ్ లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా మారింది. ముఖ్యంగా ఆ చిత్రంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగాయి. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఆ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అలాగే కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనుండగా, విలక్షణ నటుడు జగపతి బాబు డిఫరెంట్ లుక్ లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్సెస్, పాటలు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ముఖ్యంగా చరణ్ లుక్స్, మేకింగ్ స్టైల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దీంతో పెద్ది కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే ఆ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ విషయంలో మాత్రం అనిశ్చితి నెలకొంది. మొదటగా మార్చి 27న విడుదల చేస్తామని ప్రకటించిన మేకర్స్, ఆ తర్వాత ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. కానీ తాజా సమాచారం ప్రకారం ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం కష్టమేనని తెలుస్తోంది. దీంతో కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడు ప్రకటిస్తారో అన్నదానిపై క్లారిటీ లేకపోవడం అభిమానుల్లో కొంత నిరాశను కలిగిస్తోంది. అదే సమయంలో బుచ్చిబాబు సనాకు పెద్ది ప్రాజెక్ట్ చాలా కీలకంగా మారింది.ఒక్క సినిమా అనుభవంతోనే ఇంత భారీ ప్రాజెక్ట్‌ను హ్యాండిల్ చేయడం చిన్న విషయం కాదు.అయితే తనకు వచ్చిన ఆ అవకాశాన్ని పూర్తిగా విని యోగించుకుని, అగ్ర దర్శకుల సరసన నిలబడాలనే లక్ష్యంతో ఆయన పని చేస్తున్నట్లు తెలుస్తోంది.సినిమా లేట్ అవుతున్నా, క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని వినికిడి.

# వయసు ఒక నంబర్ మాత్రమే:
# 63 ఏళ్ల వయసులో నటి అడ్వెంచర్స్!



వయసు పెరిగేకొద్దీ శారీరక శ్రమకు దూరంగా ఉండాలని చాలామంది భావిస్తుంటారు. కానీ అలనాటి బాలీవుడ్ నటి అనితారాజ్ మాత్రం అందుకు పూర్తి విరుద్ధం.వయసు పెరిగేకొద్దీ శారీరక శ్రమకు దూరంగా ఉండాలని చాలామంది భావిస్తుంటారు. కానీ అలనాటి బాలీవుడ్ నటి అనితారాజ్ మాత్రం అందుకు పూర్తి విరుద్ధం. ప్రస్తుతం 63 ఏళ్ల వయసులో ఉన్న ఈ వెటరన్ నటి జిమ్‌లో యువతకు సవాల్ విసిరేలా కఠినమైన వ్యాయామాలు చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే! అని నిరూపిస్తూ జిమ్ లో హార్డ్ వర్క్ చేస్తున్న వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుండటంతో అవి కాస్తా ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. 1981లో -ప్రేమ్ గీత్- చిత్రంతో బాలీవుడ్ తెరకు పరిచయమైన అనితారాజ్ సుమారు 100కు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు. అలనాటి మేటి నటుడు జగదీష్ రాజ్ కుమార్తెగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన అనితారాజ్ ధర్మేంద్ర వంటి స్టార్ హీరోల సరసన నటించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

కేవలం వెండితెరపైనే కాకుండా చోటీ సర్దార్నీ, యే రిష్తా క్యా కెహ్లాతా హై వంటి పాపులర్ సీరియల్స్ తో బుల్లితెర ప్రేక్షకులకు కూడా అనిత దగ్గరయ్యారు. నటిగా ఎంతో బిజీగా ఉన్నా కానీ... తన ఆరోగ్యం విషయంలో అనితా చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయం. తన ఫిట్‌నెస్ విషయానికొస్తే... ఈ వయసులో భారీ బరువులు ఎత్తడం (వెయిట్ లిఫ్టింగ్), కష్టతరమైన ప్లాంక్స్, పుల్-అప్స్ వంటి వర్కవుట్స్‌ను అనితారాజ్ ఎంతో సునాయాసంగా చేసేస్తున్నారు. ఉదయం లేవగానే కనీసం జాగింగ్ చేయడానికి కూడా బద్ధకించే నేటి తరం యువతకు ఈ ఏజ్ లెస్ నటి ఒక గొప్ప స్ఫూర్తి అని చెప్పాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం..

సరైన పోషకాహారం తీసుకోవడమే తన ఫిట్‌నెస్ రహస్యమని ఆమె చెబుతుంటారు. -వీకెండ్ వైబ్స్.. వర్కవుట్ హైస్- అంటూ షేర్ చేసే పోస్టులు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి అనితారాజ్ క్రమశిక్షణ , అంకితభావం చూసిన అభిమానులు తనను -ఫిట్‌నెస్ ఐకాన్-గా కొనియాడుతున్నారు. 60 ఏళ్లు దాటిన తర్వాత కూడా ఒక వ్యక్తి ఇంతటి శక్తిని, ఉత్సాహాన్ని కలిగి ఉండటం వెనుక సంవత్సరాల తరబడి చేసిన కష్టం ఉందని వారు కామెంట్స్ చేస్తున్నారు.

వృద్ధాప్యం అనేది కేవలం శరీరానికి మాత్రమే కానీ మనసుకి కాదని.. ఇష్టపడితే ఏ వయసులోనైనా దృఢంగా ఉండవచ్చని నిరూపిస్తున్నారు.

అనితా రాజ్ సాహసాలు ఎంతోమందికి ఒక కొత్త ప్రేరణ. తన వృత్తిని.. వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేసుకుంటూనే అనితారాజ్ ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టడం విశేషం. దర్శకుడు సునీల్ హింగోరానీని వివాహం చేసుకున్న ఈ నటికి శివమ్ అనే కుమారుడు ఉన్నాడు. తన కుటుంబ సభ్యులతో పాటు.. మేనకోడళ్లు మాళవిక రాజ్, సోనాక్షి రాజ్‌లకు కూడా తనే ఒక రోల్ మోడల్. లక్ష్యంపై స్పష్టత, చేసే పనిపై పట్టుదల ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఏదైనా సాధించవచ్చని అనితారాజ్ తన జీవనశైలి ద్వారా చాటి చెబుతున్నారు.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197